బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం, 27 మే-2026
balagamtv100@gmail.com
పేజీలు-8

## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం



వివరాలు 2లో..

## ఖనిజాల తవ్వకం, శుద్ధిపై కీలక ఒప్పందం



- క్వాడ్ విదేశాంగ్ మంత్రులు సమావేశంలో ఎంఓయూ

న్యూఢిల్లీ,మే26 : కీలక ఖనిజాల తవ్వకం, శుద్ధి సరఫరాలను సురక్షితం చేసే ఫ్రేమ్‌వర్క్‌కు సంబంధించిన ఒప్పందంపై భారత్–అమెరికాలు సంతకాలు చేశాయి. మంగళవారం న్యూఢిల్లీలో క్వాడ్ విదేశాంగ మంత్రల సమావేశం జరిగింది. ఈ సమావేశం సందర్భంగా అమెరికా– భారత్‌ల మధ్య కీలక ఒప్పందం కుదిరి ంది. ఇది చాలా సమయోచితమైన ? కీలకమైన విషయం అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సమక్షంలో భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ అన్నారు.ఈ ఒప్పందం పటిష్టమైన, వైవిధ్యభరితమైనసరఫరా గొలుసులను బలోపేతం చేస్తుందని, ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందిం చడంతో పాటు కీలక ఖనిజాలు,అరుదైన మూలకాల్ని తవ్వి తీయడానికి, వాటి నిర్వహణకు కీలకమని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. ఎన్నో సవాళ్లు, అదే సమయంలో ఎన్నో అవకాశాలు ఉన్న ఈ ప్రపంచంలో భారత్ ? అమెరికాల మధ్య ఉన్న సహకా రం ఎంత సన్నిహితంగా ఉందో చెప్పడానికి ఇది మరో నిదర్శనం అని ఆయన అన్నారు. ఇక మార్క్ మాట్లాడుతూ.. రూబియో అమె రికా ? భారతదేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యం.. అది ఇరు దేశాల జాతీయ ప్రయోజనాలకు ముఖ్యమైనదని ఆయన అన్నారు. మన ఆవిష్కరణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైన కీలక ఖనిజాలు, సరఫరా గొలుసులకు ఇది దీర్ఘకాలిక విశ్వసనీయతని స్తుంది. ఈ ఒప్పందంలో ఇరు దేశాలు వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నాయి. క్రిటికల్ మినరల్స్ ఫోరమ్‌లో ఫిబ్రవరి 4వ తేదీన భారత్ చేరినప్పుడే ఈ ఒప్పందానికి పునాది పడిందది' అని రూబియో తెలిపారు.

# తెలంగాణలో అవినీతి రాజ్యం

- అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్
- శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్
- సింగరేణిలిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు



హైదరాబాద్, మే 26: తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. భూములు ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్మకమాలు జరుగు తు న్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుం టున్నా రని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో మిగతా 3లో..

# ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'



- సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు
- భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

హైదరాబాద్,మే26 : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్య క్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీ క్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్య ంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశం చింది. ఇందులో భాగంగా



జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్ర మాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా–శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక మిగతా 3లో..

# డబ్బుల కోసం డ్రగ్స్ సరఫరా



- పంజాబీ సింగ్ సోహల్ అరెస్ట్

చండీఘడ్,మే26 : డ్రగ్స్ కేసులో పంజాబీ సింగర్ హర్బీర్ సింగ్ సోహాల్ అరెస్టయ్యాడు. కారులో హెరాయిన్ తరలిస్తుండగా పోలీసులు అతడిని పట్టుకున్నారు. కారు నుంచి 5.1 కేజీల హెరాయిన్, 1.50 లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఖన్నా ఎస్ఎస్‌పీ దర్పన్ అహ్లువాలియా తెలిపిన వివరాల మేరకు? డ్రగ్స్ సప్లై రాకెట్‌లో హర్బీర్ కొరియర్‌గా వ్యవహరిస్తున్నాడు. హ్యాండ్లర్‌ల ద్వారా ఆస్ట్రేలియా, కెనడా నుంచి వచ్చిన డ్రగ్స్‌ను లోకల్ సప్లయర్స్‌కు మిగతా 3లో..

# చొరబాటు దారులూ పారిపోండి

- వెళ్లగొట్టక ముందే పారిపోతే మంచిది
- జైల్లో పెట్టి తిండి పెట్టేది లేదు
- బంగ్లాదేశ్ వలసదారులకు సిఎం సువేందు హెచ్చరిక
- సరిహద్దుల వద్దకు చేరుకుంటున్న అక్రమవసలదారులు



కోల్‌కతా,మే26: పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమవలసదా రులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది. అక్రమవల సదారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల సమ యంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారి పోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీక రించ డానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటు దారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమె ందుకు ఆతిథ్యం ఇవ్వాలని దేశ వనరు లను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు మిగతా 3లో..


# దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

- తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే
- పోలీసులకు లొంగిన నరహరి,ధనమ్మ జంటకు చెక్కులు అందచేత
- గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి
- డిజిపి సివి ఆనంద్ పిలుపు



హైదరాబాద్, మే 26: మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నా రని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావో యిస్టులు లొంగిపోయారని మిగతా 3లో..

# నష్టాల బాటలో స్టాక్ మార్కెట్లు



న్యూఢిల్లీ,మే26 : లాభాల స్వీకరణ కారణంగా దేశీయ సూచీలు మంగళవారం నష్టాల బాట పట్టాయి. సోమవారం సూచీలు భారీ లాభాలు ఆర్జించిన నేపథ్యంలో గరిష్ఠాల వద్ద మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపడం ప్రతికూలంగా మా రింది. మరో వైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి (95.68) బలహీనపడడం నెగిటివ్‌గా మారింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ రాజుకున్న నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాలతో రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (76,488)తో పోల్చు కుంటే మంగళవారం ఉదయం దాదాపు 250 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత పైకి వచ్చింది. అయితే చివర్లో అమ్మకాల వల్ల సూచీలు మళ్లీ నష్టాల బాట పట్టాయి. చివరకు సెన్సెక్స్ 479 పాయింట్ల నష్టంతో 76,009 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 118 పాయింట్ల నష్టంతో 23,913 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్, నిఫ్టీలో ఎక్సైడ్ ఇండస్ట్రీస్, అదానీ పవర్, ఇన్ఫో ఎడ్జ్, అదానీ ఎనర్జీ, అదానీ ఎంట ర్‌ప్రైజెస్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. కంటైనర్ కార్పొరేషన్, రైల్ వికాస్, కేన్స్ టెక్, టొరెంట్ ఫార్మా, అశోక్ లేలాండ్ మొదలైనషేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 200 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ మాత్రం 332 పాయింట్లు ఆర్జించింది.

# వాహనదారులపై మళ్లీ పిడుగు



- సిఎన్‌జి ధరలు పెంచిన కేంద్రం
- వరుసగా నాలుగోసారి పెరిగిన ధరలు

న్యూఢిల్లీ,మే26 : కేంద్రం మళ్లీ షాకిచ్చింది. సీఎన్‌జీ ధరలను మరోసారి పెంచింది. కిలో సీఎన్‌జీపై రూ.2 పెంచింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో ఢిల్లీలో సీఎన్‌జీ ధర రూ.81.09 నుంచి రూ.83.09కి చేరింది. సీఎన్‌జీ ధరలను పెంచడం మే 15వ తేదీ నుంచి ఇది నాలుగోసారి కావడం గమనార్హం. మే 15వ తేదీన మొదట కిలోకు రూ.2 పెంచగా.. అనంతరం రెండుసార్లు ఒక్క రూపాయి చొప్పున కేంద్రం పెంచింది. తాజాగా మరో రూ.2 పెరగడంతో నాలుగోసారి సీఎన్‌జీ ధరలు పెరిగినట్లయ్యింది. గత 11 రోజుల్లో మొత్తం రూ.7 వరకు ధరలు పెరగడంతో వాహనదా రులు, ఆటో, క్యాబ్, ట్రాన్స్‌పోర్ట్ రంగాలపై అదనపు భారం

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

కరీంనగర్,మే26 : రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ పక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ



దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

బలగం TV BALAGAM balagamtv100@gmail.com

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

- యుద్ధ ప్రభావంతోనూ సరఫరాలో అంతరాయం
- రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టవద్దు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



హైదరాబాద్,మే26 :యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫ రాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఇకపోతే రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరిం చారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగు మందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయం లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకే తికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తు న్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పిం చాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

- సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం
- సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క




హైదరాబాద్, మేఎ): మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖినివాస్‌వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లనుబుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొ న్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణమహిళలకు హైదరాబాద్‌లోసురక్షిత వసతి కల్పిస్తు న్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మందిమహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్న పిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నా మని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశా రు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డిపిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలా ల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పా టు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహి ళాశక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.



# ఎసిబి వలలో మహిళా తహసిల్దార్

- 2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

మేడ్చల్,మే26 : రాష్ట్రంలో మరో అవినీతి అధికారిణి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం ఇద్దరు, మంగళవారం మరో ఇద్దరు అధికారులకు చిక్కడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలానికి చెందిన తహసీల్దార్ టి.సుచరిత రెండు లక్షల రూపాయలు తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ కేసులో ఆమె డ్రైవర్ వి నాగేష్‌ను కూడా అరెస్టు చేశారు. 30 ఎకరాల వ్యవసాయ భూమిలో నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తును ఆమోదించాలని తహసీల్దార్‌ను కోరగా అందుకు రూ.30లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం మధ్యాహ్నం కార్యాలయంలో తహసీల్దార్ ప్రైవేట్ డ్రైవర్ నాగేష్‌కు రూ.2లక్షలు అందజేశాడు. డ్రైవర్ ఆ డబ్బును తహసీల్దార్ సుచరితకు ఇస్తుండగానే మాటు వేసిన ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం డబ్బును పట్టుకున్నారు. ఆమెతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన





- నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ

హైదరాబాద్, మే): కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# ఎంజిబిఎస్‌లో బస్సులో మంటలు

హైదరాబాద్,మే26: హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గద్వాల డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు లో మంగళవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మహబూబ్ నగర్, గద్వాల వైపు వెళ్లే బస్సులు ఆగే ప్రాంతంలోని ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భయంతో బస్సు దిగి ప్రయాణికులు పరుగులు తీశారు. అనంతరం ప్రయాణికులు బస్సు దిగి మంటలార్పే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న ఆర్టీసీ సిబ్బంది మంటలు వ్యాపించకుండా నీళ్లతో ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది.

# గవర్నర్‌ను కలిసిన కవిత

- వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని వినతి





హైదరాబాద్, మే 26: ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూ నిర్వాసితులకు న్యాయం చేయాలనిగవర్నర్ శివప్రతాప్‌శుక్లాను కోరినట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవితతెలిపారు. లోక్ భవన్‌లోగవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. వెలుగు మట్లతో పాటు వికారాబాద్ జిల్లా కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసి గవర్న ర్‌నుకలిశామని చెప్పారు. వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరామన్నారు. కడ్లాపూ ర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు తదితర సమ స్యలపై బాధితులతో కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామ న్నారు. న్యాయం జరగకపోతే మళ్లీ పోరాట బాట పడతామని కవిత చెప్పారు.

# డిజిటల్ యుగంలో ప్రజలకు వైఫై ముఖ్యం

- అందుబాటులో టెక్నాలజీ అవసరం
- పిఎం వాణిపై సమీక్షించిన మంత్రి పెమ్మసాని

న్యూఢిల్లీ,మే26:పీఎం వాణి ద్వారా ప్రతి పౌరుడికీ సులభమైన పబ్లిక్ వైఫై అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో పీఎం వాణి అమలుపై ఉన్నతాధికారులతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు, ప్రయాణికులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు సహా ప్రతి ఒక్కరికీ ప్రజా వైఫై కీలక ప్రజా సేవగా మారుతోందన్నారు. వినియోగదారులకు మరింత సులభతరం చేసేలా ల్యాప్ టాప్‌లు, ఇతర సెకండరీ పరికరాలకు క్యూఆర్ ఆధారిత లాగిన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మొబైల్ ద్వారా క్యూఆర్ స్కాన్ చేసి సులభంగా ల్యాప్‌టాప్‌ను కనెక్ట్ చేసుకునే విధంగా వ్యవస్థను రూపొంది స్తున్నామని చెప్పారు. తక్కువ సమయం ఇంటర్నెట్ అవసరమయ్యే వినియోగదారుల కోసం 15, 30, 60 నిమిషాల స్వల్ప కాల వినియోగ ఎలాన్లు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్, మాల్స్, ప్రజా ప్రదేశాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత సులభతరం చేయడమే లక్ష్యమన్నారు. పీఎం వాణి హాట్‌స్పాట్‌ల గుర్తింపును మరింత సులభతరం చేసేలా స్టాండర్డ్ నేమింగ్ విధానాన్ని తీసుకు వస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మరింత వేగవంతమైన, సురక్షితమైన, నమ్మకమైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు పీఎం వాణి వ్యవస్థలో సమగ్ర మార్పులు చేపడుతున్నామని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా లక్ష్యాలను అనుగుణంగా దేశంలో ప్రతి పౌరుడికి సులభమైన డిజిటల్ కనెక్టివిటీ అందుబాటులోకి తీసుకురావడమే తమ సంకల్పమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో పీఎం వాణి అమలు వేగవంతం, వినియోగదారుల అనుభవం మెరుగుదల, డిజిటల్ కనెక్టివిటీ విస్తరణ తదితర అంశాలపై అధికారులతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు.

# మంత్రి జూపల్లి ఆదేశాలతో అన్‌లోడింగ్ సమస్య

- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి



నాగర్ కర్నూల్,మే26 : మంత్రి జూపల్లి ఆదేశాలకు భయపడి అధికారులు నాగర్ కర్నూల్ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తాడూర్ మండలం పరిధిలోని ఇంద్రకల్ గ్రామ శివారులోని మణికంఠ కాటన్ మిల్లు గోదాం దగ్గర మొక్కజొన్న, ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్,పరిస్థితిని ఆయన తనిఖీ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న అన్‌లోడింగ్ సమస్యను తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నేరుగా గోదాంకు వెళ్లి రైతుల ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన మొక్కజొన్న ధాన్యం అన్‌లోడ్ చేయకుండా కేవలం మంత్రి జూపల్లి ఆదేశాలతో కొల్లాపూర్‌కు చెందిన దళారుల ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కొల్లాపూర్‌కు చెందిన 30 లారీల ధాన్యం అన్‌లోడ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం దళారుల వ్యవస్థకు మద్దతిస్తుం దని తెలిపారు. రైతుల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల వివక్షత చూపితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గోదాం వద్ద ఉన్న రైతులకు, డ్రైవర్స్‌కు స్వయంగా భోజనం తెప్పించి పెట్టారు. ఆయన వెంట పలువురు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎసిబి వలలో మరో అవినీతి చేప

## పదివే లంచం తీసుకుంటుండగా సర్వేయర్ పట్టివేత

జోగులాంబ గద్వాల,మే26 : ఎసిబి వలలో మరో అవినీతి చేప చిక్కింది. భూముల సర్వే చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటూ జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తన భూమిని సర్వే చేయాల్సిందిగా మండల సర్వేయర్ బ్రహ్మయ్యను బాధితుడు ఆశ్రయించగా రూ. 10 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా వ్యూహం మేరకు పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కోర్టుకు తరలించనున్నారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా వదిలేది లేదని అధికారులు హెచ్చరించారు.

# అమెరికాలో కాల్పుల ఘటన

## సూపర్ మార్కెట్‌లో కాల్పుల్లో భారతీయ మహిళ మృతి



వాషింగ్టన్,మే26 : అమెరికాలో విషాద ఘటన చోటుచేసుకుంది. వర్జీనియా రాష్ట్రంలోని ఒక సూపర్ మార్కెట్‌లో మే 23 శనివారం గుజరాత్‌కు చెందిన భారతీయ మహిళ దారుణ హత్యకు హత్యకు గురయ్యారు. మృతురాలు బిజాపూర్ ప్రాంతంలో మెహసానా జిల్లా జంత్రాల్ గ్రామానికి చెందిన మేఘనా పటేల్‌గా గుర్తించారు. మేఘ్నా పటేల్ దుకాణం లోపల ఉండగా.. ఆ సమయంలోనే ఓ దుండగుడు కస్టమర్ తరహాలో లోపలికి వచ్చి సెకన్ల వ్యవధిలోనే ఆమెపై కాల్పులు జరిపాడు. దుండగుడు ఆమెపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటనకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌లో దృశ్యాలు కూడా బయటకు వచ్చాయి. ఈ కాల్పులు దోపిడీ ఉద్దేశంతోనే జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

- డిజిపిని కలిసి కోరినట్లు నాగేశ్వర్ వెల్లడి



హైదరాబాద్,మే26 : తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో తనపై చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు. తన వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహ రించుకున్నట్లు చెప్పారు. ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పష్టం చేశారు. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యా ణ్‌పై నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమా రం రేపాయి. ఈ నేపథ్యంలో ఆయనపై ఏపీలో పలు చోట్ల కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో నాగేశ్వర్‌ను అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసులు తెలంగాణకు చేరుకున్నారంటూ ప్రచారం జరిగింది. దాన్ని ఏపీ ప్రభుత్వం ఖండిం చింది. ఇదంతా అసత్య ప్రచారమని స్పష్టం చేసింది.

# నేడు ఢిల్లీకి తమిళనాడు సిఎం విజయ్

## ప్రధాని మోడీతే భేటీకి అవకాశం



చెన్నై,మే26 : తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ బుధవారం ఢిల్లీ పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీని కలిసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించారు. బుధవారం ఉదయం సీనియర్ అధికారులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో సహా విజయ్ ఢిల్లీకి చేరుకోనున్నారు. అలాగే ఈ పర్యటనలో కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఆయన కలవనున్నారు. విజయ్ ముఖ్యమంత్రి అయ్యాక ఇదే తొలి పర్యటన కావడం గమనార్హం.

# పవన్‌పై వ్యాఖ్యలు

## ప్రొపెసర్ నాగేశ్వర రావు అరెస్ట్‌కు రంగం సిద్ధం

## డిజిపి ఆనందంను కలిసి రక్షణ కల్పించాలన్న నాగేశ్వర్

హైదరాబాద్,మే26 : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ పోలీసులు అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఆంధ్రా పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారన్న వార్తల నేపథ్యంలో నాగేశ్వర్ రావు ఇంటి వద్ద తెలంగాణ పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలో నాగేశ్వర్ రావు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. తనకు భద్రత కల్పించాలని డీజీపీని కోరారు. కాగా, తెలంగాణ రాష్ట్రంలో అరెస్ట్ చేయాలంటే ఇక్కడి పోలీసుల అనుమతి ఉండాలని, లేకపోతే అది అక్రమ అరెస్టుగా పరిగణించాల్సి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అరెస్టుకు అనుమతి ఇస్తారా లేక అరెస్టును అడ్డుకుంటారా అని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ అరెస్ట్ చేసేందుకు వస్తే హైకోర్టులో అరెస్ట్ కాన్సిల్ చేసేందుకు రిట్ పిటిషన్ దాఖలు చేసే ఆలోచనలో ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు ఉన్నట్లు సమాచారం.

(మొదటిపేజీ తరువాయి)

## ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అవినీతి రాజ్యం

సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

ఎర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలం గాణా పోలీ సులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగి పోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావో యిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

## వాహనదారులపై మళ్లీ పిడుగు

పడనుంది. ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. సోమవారం నాడు పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49 నుంచి రూ. 95.20కి పెరిగింది.

## చొరబాటు దారులూ పారిపోండి

స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హాకింపూర్ సరిహ ద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. భారత్ నుంచి తమ పౌరు లను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకు వెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొం టున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## డబ్బుల కోసం డ్రగ్స్ సరఫరా

చేరవేస్తున్నాడు. మే 7వ తేదీన 22 ఏళ్ల అక్షయ్ కుమార్ అనే వ్యక్తి డ్రగ్ ట్రాఫికింగ్ కేసులో అరెస్టయ్యాడు. పోలీసులు అతడి ఇంట్లో పెద్ద మొత్తంలో డ్రగ్స్ గుర్తించారు. 301 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా.. లుథియానాలోని షిమ్లపురికి చెందిన విశాల్, సంజీవ్ కుమార్‌ల నుంచి తాను డ్రగ్స్ కొనుగోలు చేశానని చెప్పాడు. పోలీసులు సంజీవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హర్బీర్ సోహాల్ పేరు బయటకు వచ్చింది. హర్బీర్‌పై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయి. 2022లో అతడు ఎక్స్‌టార్షన్ రాకెట్ కేసులో అరెస్ట్ అయ్యాడు. కొన్ని నెలల పాటు జైలులో ఉన్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇప్పుడు డ్రగ్స్ రాకెట్ కేసులో అరెస్ట్ అయ్యాడు.


## స్కూళ్లు, ఆలయాలకు దూరంగా మద్యం షాపులు

### సబ్సిడీ క్యాంటిన్లలో 5లకే చేప భోజనం..ఆదేశాలు జారీ చేసిన సిఎం సువేందు

**కోల్‌కతా,మే26 :** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి మంగళవారంనాడు పలు సంక్షేమ, నియంత్రణ చర్యలను ప్రకటించారు. విద్యాసంస్థలు, ఆలయాలకు ఒక కిలోమీటర్ దూరంలోపు మద్యం దుకాణాలపై నిషేధం విధించారు. మహిళలకు ప్రతినెలా ఆర్థిక సాయం, రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీపై చేపలతో కూడిన భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సువేందు అధికారి వివరిస్తూ, స్కూళ్లు, కాలేజీలు, ఆలయాలకు కిలోమీటరు దూరంలోపు మద్యం దుకాణాలను అనుమతించమని చెప్పారు. అన్నపూర్ణ యోజన కింద అర్హులైన మహిళలకు రూ.3,000 ఆర్థికసాయం అందించనున్నామని, మే 27 నుంచి అప్లికేషన్లను సెక్రటేరియట్ నుంచి జారీ చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఈ పథకం ద్వారా లబ్ది చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సబ్సిడీతో క్యాంటిన్లు ఏర్పాటు చేయనున్నామని, రూ.5కే చేపలతో కూడిన భోజనం అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. ఇందుకోసం 400 క్యాంటిన్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య శాఖ నుంచి వేరుచేస్తూ ప్రత్యేక ఆయుష్ శాఖను పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

## మరోమారు పెరోల్‌పై బయటకు డేరాబాబా

- 9 ఏళ్లలో 16 సార్లు పెరోల్ పొందిన గుర్మీత్



**న్యూఢిల్లీ,మే 26 :** అత్యాచార కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ అలియాస్ డేరా బాబా మరోసారి 30 రోజుల పెరోల్‌పై విడుదలయ్యారు. హరియాణాలోని సునారియా జైలు నుంచి మంగళవారం బయటకు వచ్చారు. 2017లో శిక్ష పడిన తర్వాత ఆయనకు 16వసారి పెరోల్ లభించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తన శిష్యురాళ్లు ఇద్దరిపై అత్యాచారానికి ఒడిగట్టిన నేరానికి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ మరోసారి పెరోల్‌పై విడుదలయ్యారు. 2017లో అతడికి శిక్ష పడిన నాటినుంచి పెరోల్‌పై తాత్కాలికంగా విడుదల వడం ఇది 16వ సారి. శిక్ష అనుభవిస్తున్న గత 9 ఏళ్లలో 400 రోజులకు పైగా అతడు జైలు బయటే గడిపాడు. ప్రస్తుత పెరోల్ కాలంలో డేరా బాబా సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలోనే ఉంటారని న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 2002లో ఒక జర్నలిస్టు హత్య కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు డేరా బాబాకు యావజ్జీవ కారాగార శిక్ష విధించగా.. ఏడేళ్ల జైలు జీవితం తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారు. ఆ తర్వాత, తన శిష్యురాళ్లపై లైంగిక వేధింపుల కేసులో 2017లో గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. నాటినుంచి జైల్లోనే ఉంటున్నాడు. 2020 నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో 16 సార్లు పెరోల్‌పై విడుదలై.. రోజులతరబడి బయటే తిరుగుతున్నారు. ఇప్పటికి గుర్మీత్ శిక్ష ప్రారంభమై 9 ఏళ్లు అవుతోంది. ఈ 9 ఏళ్ల కాలంలో ఆయన 400 రోజులకు పైగా జైలు బయటే గడిపారు. ప్రస్తుత పెరోల్ కాలంలో గుర్మీత్.. సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కేంద్రంలో ఉండనున్నారు. అధికారులు కఠిన నిఘా మధ్య ఆయనను అక్కడికి తరలించినట్లు సమాచారం. గతంలో ఎన్నికల సమయాల్లో కూడా రామ్ రహీమ్‌కు పెరోల్ మంజూరు కావడం వివాదాస్పదమైంది. ప్రతిపక్ష పార్టీలు దీనిపై పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశాయి. రామ్ రహీమ్ విడుదలయ్యే ప్రతిసారీ ఆయన అనుచరులు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈసారి కూడా హరియాణా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

## టిడిపి కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు

- ఈ మహానాడు గిన్నిస్ రికార్డు ఎక్కబోతోంది
- టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధీమా



**అమరావతి,మే26 :** తెలుగుదేశం పార్టీ ఈసారి నిర్వహించే మహానాడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో ఎక్కబోతుందని ఆంధ్రప్రదేశ్ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్లలో పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే మహానా డుతో అనుసంధానం కాబోతున్నారని పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. ఇప్పటివరకు 1851 క్లస్టర్లతో సాంకేతికంగా మ్యాపింగ్, అనుసంధానం పూర్తయిందని తెలిపారు. మిగతా 24 క్లస్టర్లలో నెట్ కవరేజ్ లేకపోవడంతో వారందరిని మండల కేంద్రాలకు తీసుకువచ్చి మహానాడులో పాల్గొనే విధంగా చేస్తున్నామని వివరించారు. మొత్తం 20 తీర్మానాలు రెండు రోజుల్లో పూర్తిచేస్తున్నామని పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ తీర్మానాలపై రెండు రోజుల్లో 65 నుంచి 80 మంది వరకు మాట్లాడుతారని చెప్పారు. మహిళలే కేంద్రంగా ఈసారి మహానాడు జరగనుందని వెల్లడించారు. రాబోయే రోజుల్లో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు వస్తాయని చెప్పారు. ఏపీలో అభివృద్ధికి, సంక్షేమానికి అడ్డుపడటం, రాజధాని అమరావతి, పోలవరంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మాట్లాడతామని అన్నారు. వైసీపీ హయాంలో చేసిన అరాచకాలపై కూడా మహానాడులో చర్చిస్తామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ వ్యవహరిస్తున్న తీరును కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు. మహానాడులో జగన్ అండ్ కో ప్రజా వ్యతిరేక చర్యలపై చర్చించడంతో పాటు తీర్మానం కూడా చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు రాజ కీయ తీర్మానం కూడా ఉంటుందని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహానాడు జరుగుతుందని చెప్పుకొచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని తెలిపారు. సాంకేతికంగా కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అనుసంధానం చేశామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## అట్టహాసంగా కాకుండా ఆన్‌లైన్‌లో మహానాడు

- టిడిపి పాలనా విజయాలు ప్రజలకు వివరిస్తాం
- ఎమ్మెల్యే బోండా ఉమ వెల్లడి

**అమరావతి,మే 26 :** రాష్ట్ర, దేశ పరిస్థితుల దృష్ట్యా ఈసారి మహానాడును అట్టహాసంగా కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తెలిపారు. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెల్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని తెలిపారు. జూమ్ యాప్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 1870 క్లస్టర్లలో ఒకేసారి ఈ కార్యక్రమం నిర్వహించడం ఒక రికార్డుగా నిలవబోతోందని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'గత 23-24 నెలల పరిపాలనలో యువత కోసం మెగా డీఎస్సీ ద్వారా 17,000 నుంచి 18,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం'.. 'గ్రూప్ 4, ఎస్ఐ, 5 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాము. చదువు మధ్యలో ఆపేసిన వారికి.. స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి బ్యాంకు సపోర్టుతో రుణాలు అందిస్తున్నాము. ఈసారి మహానాడు 'మహిళా శక్తి' థీమ్ మీద జరుగబోతోంది. దీని ముఖ్య ఉద్దేశం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే. డ్వాక్రా మహిళలకు ఎటువంటి హామీ లేకుండా 10 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాము. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాము'.. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నాము. డ్రగ్స్ వాడకాన్ని వెంటనే గుర్తించేలా పోలీసులకు 'స్పాట్ అనాలసిస్' కిట్లను అందించాము. ఈసారి మహానాడులో రైతులకు, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు సంబంధించి ప్రత్యేక తీర్మానాలు చేయబోతున్నాము' అని తెలిపారు.

## కర్నాటకలో అధికార మార్పిడిపై చర్చించలేదు

- నాయకత్వ మార్పు ఊహాగానాలన్నీ అవాస్తవం
- రాజ్యసభ ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికలపైనే చర్చించాం
- కర్నాటకంపై కాంగ్రెస్ పెద్దల సమావేశంపై ె కసి వేణుగోపాల్ వివరణ

**న్యూఢిల్లీ,మే26 :** కర్ణాటకలో అధికార మార్పిడికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ సమావేశంలో ఎలాంటి చర్చా జరగలేదని కేసీ వేణుగోపాల్ అన్నారు. త్వరలో జరగనున్న కర్ణాటక రాజ్యసభ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే సమావేశంలో చర్చ జరిగినట్టు చెప్పారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కాంగ్రెస్ అధిష్టానం మంగళవారంనాడు జరిపిన ఉన్నత స్థాయి సమావేశం ముగిసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, కేసీ వేణుగో పాల్, కర్ణాటక ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనతరం కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ 'కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. ఈ సమావేశంలో కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశాలే చర్చించాం. కర్ణాటక నుంచి రాజ్యసభ ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికల్లో అనుసరిం చాల్సిన వ్యూహాలను చర్చించాం' అని చెప్పారు. చర్చలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కర్ణాటక ఇన్‌చార్జి, తాను పాల్గొన్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా రాజ్యసభ సీట్ల ఎన్నికలను ప్రకటించారని, దానిపైనే ఈరోజు చర్చించామని, తక్కినవన్నీఊహాగానాలేనని వివరించారు. కాంగ్రెస్ 2023లో కర్ణాటకలో అధికారం చేపట్టి నప్పటి నుంచి శివకుమార్‌కు పదోన్నతిపై పలుమార్లు ఆయన వర్గం నేతలు డిమాండ్ చేస్తూ వచ్చారు. అధికారం పంపకాలపై ముఖ్యమంత్రి ఎన్నికకు ముందే ఒక అవగాహన ఉందని నేతలు చెబుతున్నారు. అయితే సిద్ధరామయ్య ఆ వాదన లను తోసిపుచ్చారు. ఐదేళ్లూ తాను అధికారంలో ఉంటానని, అయితే పార్టీ నిర్ణయానికి తాను, శివ కుమార్ కట్టుబడి ఉంటామని పలుమార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లను ఢిల్లీకి రమ్మని పార్టీ అగ్రనాయకత్వం పిలవడంతో నాయకత్వ మార్పిడి అంశం మరోసారి ప్రచారంలోకి వచ్చింది.

## ధాన్యం సేకరణలో సత్వర చర్యలు

### అధికారులను ఆదేశించిన కలెక్టర్

**మహబూబ్‌నగర్,మే26 :** ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మండల అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ హరిప్రియ ఆదేశించారు. మంగళవారం మిడ్జిల్ మండలంలోని రాణి పేట, మున్ననూరు, వాడియాల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు వేగవంతం అయ్యేలా చూడాలని, వాహనాల కొరత రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందస్తుగా అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ధాన్యం తరలింపునకు లారీల కొరత ఉంటే ట్రాక్టర్లతో తరలించేందుకు రైతులు సిద్ధం కావాలని, కిరాయి చెల్లిస్తామన్నారు. జిల్లా సివిల్ సప్లై డీఎం రవి నాయక్, తహసీల్దార్ రవికాంత్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## సజావుగా ధాన్యం అన్‌లోడింగ్

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

**నిర్మల్,మే26:** జిల్లాలో ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా, నిరంతరాయంగా పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని లక్ష్మణచందా మండలం తిరుపల్లి గ్రామంలోని గోదామును సందర్శించి, ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న ధాన్యం అన్ లోడింగ్ తీరును పరిశీలించారు. గోదాం నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అన్‌లోడింగ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్యపై ఆరా తీసి, అవసరమైతే మరింత మంది హమాలీలను నియమించి అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సరిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.


## ఒడిషాలో విషాదకర ఘటన

### సెప్టిక్ ట్యాంక్ కూలి ఆరుగురు కూలీల మృతి

**భువనేశ్వర్,మే 26 :** ఒడిశాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళహండి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. ఊపిరాడకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కళహండి జిల్లాలోని గౌడ కర్లాంకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో సెంట్రింగ్ తీయడానికి మేస్త్రి దిగాడు. సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగి సెంట్రింగ్ తీస్తున్న సమయంలో అది కూలిపోయింది. దీంతో మేస్త్రి అందులో చిక్కుకుపోయాడు. మేస్త్రిని కాపాడేందుకు మరో ఐదుగురు సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగారు. లోపలికి దిగిన ఆ ఐదుగురు కూడా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. గ్రామస్థులు వెంటనే స్పందించి మొత్తం ఆరుగురిని వెలికి తీశారు. హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిటల్‌కు తరలించే సమయానికే వారు ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. చనిపోయిన వారిలో ముగ్గురు మేస్త్రిలు, ఒక కార్మికుడు, ఇంటి యజమాని, అతడి కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు.

## శిరాజ్‌సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

- ఆవిష్కరించిన మాజీ ప్రధాని దేవేగౌడ
- వెంకయ్య తదితర ప్రముఖుల హాజరు



**న్యూఢిల్లీ,మే 26 :** కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్స్ విత్ నరేంద్ర మోదీ' పుస్తకావిష్కరణ కార్యక్రమం దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా జరిగింది. అప్నాపన్ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అప్నాపన్ పుస్తకాన్ని శివరాజ్ సింగ్ అంకితం చేశారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి, ఆయనతో తన అనుభవాలను ఈ పుస్తకంలో కేంద్ర మంత్రి పొందుపరిచారు. పుస్తకావిష్కరణ అనంతరం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రైతు కుటుంబం నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ వచ్చారు. 17 ఏళ్ల పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో ప్రముఖ ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ పేరు తెచ్చుకున్నారు. ఉచిత పథకాలకు నేను వ్యతిరేకం. రాష్ట్రాలు తమ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించాలి. మోదీ అంటే 'మేకింగ్‌ఆఫ్ ఇండియా డెవలప్‌మెంట్' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు టీడీపీ ఎంపీలు, ఎన్డీఏ నేతలు హాజరయ్యారు.

## సంపాదకీయం

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !

ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండిబుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితంగా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చి ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది.ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరియంట్ సోకిన వారిలో 30? మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమ్జ్గం÷న్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై-రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచ్ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల

### రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మే 26: ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది.రాష్ట్రంలో మరో నాలుగురోజులపాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.



# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

- ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్,మే26 :అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టార్గ్గెట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# మహాసిమెంట్ కార్మికుల ఆందోళన

- జీతాలు పెంచాలంటూ కర్మాగారం ముందు ధర్నా

అనకాపల్లి,మే26 : ఎన్నాళ్లు చేసిన అదే కూలి ? అదే స్థాయి, తమ లాభమే కానీ కార్మికుల కష్టం పట్టదా ? అంటూ కార్మికులు నిరసన చేపట్టారు. యలమంచిలి మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఉన్న మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద మంగళవారం కార్మికులంతా తమ విధులను ఆపేసి యాజమాన్యం తీరును నిరసిస్తూ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంస్థలో వేరు వేరు కాంట్రాక్టర్ల ద్వారా దాదాపు 500 మంది పైగా రోజు వారి కూలితో పని చేస్తున్నారని కార్మికులు తెలిపారు. తామంతా సంస్థలో చేరి ఎన్ని సంత్సరాలయినా అదే స్థితిలో ఉన్నామని, చేరినప్పుడు ఉన్న కూలీనే ఇప్పటికీ ఇస్తున్నారు తప్ప ఏమాత్రం పెంచలేదని చెప్పారు. ఇప్పటివరకు సంస్థలో స్కిల్డ్ రూ.703, సెమీ స్కిల్డ్ రూ.560, అన్ స్కిల్డ్ రూ.470 మాత్రమే ఇస్తూ ఎలాంటి వారంతాపు సెలవులు లేవు, అనారోగ్య సెలవులు లేవు, ఏరోజు వస్తే ఆరోజు మస్తరు పద్ధతిలో నడుపుతున్నారని వివరించారు. ఈ కాంట్రాక్టు కార్మికులు ఏ స్థాయిలో చేరారో, మూడు, ఐదు, ఎనిమిది ఎన్ని సంవత్సరాలు గడిచినా అదే స్థాయిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంత్సరాలుగా ఎలాంటి కూలి పెంపు లేకుండా ఇటీవల రోజుకి రూ.9 పెంచుతూ, ఇది జూన్ నెల నుంచి అమలవుతుందని యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. ఈ పద్ధతి నచ్చని కార్మికులు తమ విధులు బహిష్కరించి ఉదయం నుంచి మండుటెండలోనే నిరసనలు తెలుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంతపు సెలవుతో కూడిన నెల వారి జీతం చెల్లించాలి. 2 సంవత్సరాలు దాటి పని చేస్తున్న వారిని తరువాత స్థాయికి పంపాలి. యూనియన్ ఏర్పాటుకి అవకాశం కల్పించాలని కార్మికులు కోరారు.



# ప్రొద్దుటూరులో టిడిపి వర్గాల మధ్య ఘర్షణ



- లాఠీఛార్జ్ చేసి అదుపు చేసిన పోలీసులు

కడప,మే26 : వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరులో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది.కడప జిల్లా ప్రొద్దుటూరులో అధికార టీడీపీకి చెందిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, మరో నేత ప్రవీణ్ రెడ్డి వర్గాల మధ్య తీవ్ర ఆధిపత్య పోరు రచ్చకెక్కింది. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి కుమారుడు కొండారెడ్డి భాగస్వామిగా ఉన్న ఎస్.ఎస్.షాపింగ్ మాల్ వద్ద రెండు వర్గాలు పరస్పరం రాళ్ల దాడికి పాల్పడ్డాయి. షాపింగ్ మాల్‌ను ప్రభుత్వ అనుమతులకు వ్యతిరేకంగా నిర్మించారంటూ ఇటీవల తెదేపా మాజీ ఇంఛార్జి ప్రవీణ్ మీడియా సమావేశంలో ఆరోపించారు. ఫర్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీకి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ప్రవీణ్ వర్గీయులు మాల్ వద్దకు చేరుకున్నారు. ఇరు వర్గాలు పరస్పరం రాళ్లదాడికి దిగాయి. పోలీసులు లాఠీఛార్జి చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. స్థానిక ఎస్.ఎస్. షాపింగ్ మాల్ నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారంటూ ప్రవీణ్ రెడ్డి చేసిన ఫిర్యాదుపై ఫైర్ సేఫ్టీ అధికారులు తనిఖీలకు రావడంతో ఈ వివాదం మొదలైంది. సదరు మాల్‌లో ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి భాగస్వామి కావడంతో, తనిఖీల సమయంలో ఇరు వర్గాల అనుచరులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని, పరస్పరం రాళ్లు రువ్వుకునే వరకు వెళ్ళింది. ఈ ఘర్షణతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురికాగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేయడానికి లాఠీఛార్జ్ చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పాటిదార్ ధనాదన్ స్కోరు

- 33 బంతుల్లో 93 పరుగులు
- 254 పరుగులు చేసిన రాయల్ ఛాలెంజర్స్





ధర్మశాల,మే26 : ఐపీఎల్ 2026 క్వాలిఫయర్-1లో భాగంగా మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ తలపడ్డాయి. ధర్మశాల వేదికగా జరుగుతోన్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసింది. ఆర్సీబీ బ్యాటర్లలో రజత్ పాటిదార్(33 బంతుల్లో 93 పరుగులు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. రజత్ పాటిదార్ గుజరాత్ బౌలర్లను ఊచకోత కోశాడు. కోహ్లీ (25 బంతుల్లో 43 పరుగులు), కృనాల్ పాండ్య(28 బంతుల్లో 43 పరుగులు) దేవ్‌దత్ పడిక్కల్ (19 బంతుల్లో 30 పరుగులు) రాణించారు. చివర్లో జితేశ్ శర్మ(5 బంతుల్లో 15 పరుగులు) దూకుడుగా ఆడాడు. ఇక గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో రబాడా రెండు, జాసన్ హోల్డర్ చెరో రెండు వికెట్లు సాధించారు. ప్రసిద్ధ్ కృష్ణ ఒక వికెట్ పడగొట్టాడు. మొత్తంగా గుజరాత్ టైటాన్స్ ముందు ఆర్సీబీ 255 పరుగుల భారీ టా÷-గ్గ÷ట్‌ను నిర్దేశిరచింది. తొలి ఓవర్‌లో తొలి బంతికే ఫోర్‌తో వెంకటేశ్ అయ్యర్ ఖాతా తెరిచాడు. ఒకే ఓవర్‌లో మూడు ఫోర్లు బాదాడు. 1.6 ఓవర్‌లో రబాడ బౌలింగ్‌లో గిల్‌కు చిక్కి పెవిలియన్ బాట పట్టాడు. స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగించాడు. 43 పరుగులు సాధించి.. ఐపీఎల్‌లో వరుసగా నాలుగు సీజన్లలో 600కుపైగా రన్స్ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. కోహ్లీ (43), పాటిదార్ (30)లను హోల్డర్ ఒకే ఓవర్ (9వ)లో ఔట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన కృనాల్, రజత్ పాటీదార్.. ఇద్దరూ దూకుడుగా ఆడారు. ముఖ్యంగా పాటీదార్.. సిక్సులు, ఫోర్లతో విధ్వంసం సృష్టించాడు. 13.3 ఓవర్‌లో క్యాచ్ అవుట్ నుంచి బయటపడ్డ అతడు.. మరింత వేగం పెంచాడు. 16వ ఓవర్‌లో రషీద్ ఖాన్ బౌలింగ్‌లో మూడు సిక్సులు బాదాడు. 21 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సిరాజ్ 19వ ఓవర్‌లో 21, ప్రసిద్ధ్ కృష్ణ 20వ ఓవర్‌లో 19 పరుగులు ఇచ్చారు.

# లిక్కర్ కేసులో ఇడి దూకుడు

### చెవిరెడ్డి భార్య పేరుతో అక్రమ లావాదేవీల గుర్తింపు

అమరావతి,మే26 : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విచారణను తీవ్రతరం చేసింది. ఈ స్కాంలో అక్రమ నగదు చలామణి , హవాలా మార్గాల ద్వారా భారీగా నిధులు చేతులు మారాయనే ఆరోపణలపై ఈడీ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసుల ఆధారంగా చెవిరెడ్డి భార్య, ఆయన కుమారుడు తాజాగా ఈడీ విచారణకు హాజరయ్యారు. మద్యం వ్యాపారాలు, లైసెన్సుల కేటాయింపుల వ్యవహారంలో చెవిరెడ్డి భార్య పేరిట భారీ ఎత్తున అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. హవాలా మార్గాల ద్వారా కోట్ల రూపాయల మేర చేతులు మారినట్లు వస్తున్న ఆధారాలపై అధికారులు వీరిని విచారించారని తెలుస్తోంది. ఈ కుంభకోణంలో చెవిరెడ్డి భార్యతో పాటు ఆయన కుమారుడి పాత్రపై కూడా ఈడీ కీలక ఆధారాలు సేకరించిందని సమాచారం. ఈ కేసులో మరికొందరు రాజకీయ ప్రముఖులు, అధికారుల పేర్లు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉండటంతో, తాజా ఈడీ విచారణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..




### -రాజకీయాల కంటే అభివృద్ధే ముఖ్యం..
### -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రైతాంగ సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు . మంగళవారం వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాన్ని అది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం రాజశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన వేములవాడ, సిరిసిల్ల డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, భూసార పరీక్షలు మరియు సాంకేతిక సలహాలు ఒకే చోట అందించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చూసినామని, ఈ కేంద్రం కోసం 40 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు ఒకటి చొప్పున మంజూరైన ఈ కేంద్రాన్ని వేములవాడకు తీసుకురావడం అదృష్టకరమని , దీని మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. శాస్త్రవేత్తలు రైతాంగానికి నిరంతరం అందుబాటులో ఉంటూ, పంటల సాగులో మెరుగైన సూచనలు అందించాలని కోరారు.

?గత రెండేళ్లలో వేములవాడ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ధార్మిక, కార్మిక, వ్యవసాయ రంగాల సమగ్ర అభివృద్ధి తమ లక్ష్యమని అన్నారు . నేతన్నల కోసం యార్న్ డిపోను తీసుకురావడంతో పాటు, మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు . నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు 13 ప్రాంతాల్లో 33/11 సబ్‌స్టేషన్లను మంజూరు చేయించామని చెప్పారు. రాజకీయాల కంటే ప్రజలకు చేసే అభివృద్ధే తనకు ముఖ్యమని అన్నారు.

?ధాన్యం సేకరణపై స్పందిస్తూ, ప్రభుత్వం రైతులకు పూర్తి అండగా ఉంటుందని, తడిసిన ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. గతంతో పోలిస్తే వరి దిగుబడులు గణనీయంగా పెరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా రైతులు వరి కొయ్యాలను కాల్చివేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు.

# కొనసాగుతున్న వివో ఏల నిరవధిక సమ్మె..

### -20వేల వేతనం ఇవ్వాలని డిమాండ్
### -సంఘీభావం తెలియజేసిన బీఆర్ఎస్ నాయకులు

**బలగం టివి, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తెలంగాణ ఐకెపి వివోఏ లు జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసీ)సెర్ఫ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల వారి ఆధ్వర్యంలో 19 -5- 2026 నుండి నిరవధిక సమ్మె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ఐకెపి వివోఏ శ్రమకు తగ్గ వేతనం అందించాలని ఐకెపి వివోఏ లకు కనీస వేతనం ? 20,000/- ప్రభుత్వం చెల్లించాలని సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని అర్హులైన ఐకెపి వివోఏలను సీసీలుగా పదోన్నతులు ఇవ్వాలని వివోఏ లకు సాధారణ ఆరోగ్య భీమ భద్రత కల్పించాలని. 58జీవోను సవరించాలని ట్యాబులు నెట్వర్కింగ్ సౌకర్యం కల్పించాలని ఐకెపి వివో ఏలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మె చేస్తున్న వివోఏలకు ఎల్లారెడ్డిపేట మాజీ జడ్పిటిసి సభ్యుడు చీటీ లక్ష్మణ్ రావు పలువురు బిఆర్ఎస్ నాయకులు బుగ్గ రాజేశ్వర తండా సర్పంచ్ తిరుపతి నాయక్, రాగట్లపల్లి ఉపసర్పంచ్ యాదవ్ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు కొప్పుల రమ, ఉపాధ్యక్షురాలు దొమ్మిటి రేణుక, కార్యదర్శి నాయిని నీలిమ, కోశాధికారి ఆడెపు శోభారాణి, సహాయ



కోశాధికారి తాటికొండ లావణ్య , ఎల్లారెడ్డిపేట మండల ఐకెపి వివో ఏలు పాల్గొన్నారు,

## జిల్లాలో డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు.

### ఎల్లారెడ్డిపేట మండలంలో కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ.

### మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు.

**బలగం టివి ఎల్లారెడ్డి పేట**

ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళ వారం పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.



# మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి..



### -అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు.

జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు, యువత డ్రగ్స్ వినియోగించకుండా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్స, మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యాసంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.సమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు లేని తెలంగాణ కోసం కృషి చేద్దాం

### డీఎస్పీ నాగేంద్ర చారి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

బాల్యవివాహాల రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల్యవివాహాలు లేని తెలంగాణ కోసం అందరం కలిసి కృషి చేద్దామని డీఎస్పీ నాగేంద్ర చారి పిలుపునిచ్చారు.

గంభీరావుపేట మండల కేంద్రంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజాం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు . సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి మాట్లాడుతూ బాల్య వివాహం చెడ్డరీత్యా నేరమని అమ్మాయిలకు 18 సంవత్సరాల వయసు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకముందు పెళ్లి చేస్తే వారికి జైలు శిక్ష రెండు సంవత్సరాలు లక్ష రూపాయల జరిమానా కు గురి అవుతారని హెచ్చరించారు. . అలాగే ఆధార్ కార్డును పుట్టిన తేదీకి ప్రామాణికంగా తీసుకోవడం జరగదని హెచ్చరించారు. పాఠశాల నుంచి, ఆర్డీవో బర్త్ సర్టిఫికెట్స్ మాత్రమే పరిగణలోకి తీసుకుంటారని అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పిల్లలు కెరీర్ మీద దృష్టి పెట్టాలని సూచించారు. స్నేహ క్లబ్బులు పిల్లల యొక్క ఎదుగుదలకు తోడ్పడతాయని వివరించారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లాంటి పథకాలు 18 సంవత్సరాలు నిండిన వారికే వర్తిస్తాయని సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1098, 181,100 24 గంటలు 365 రోజులు 65 రోజులు పని చేస్తాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏ రకమైన ఇబ్బందులు తలెత్తిన వెంటనే కాల్ చేయాలని సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, సిడిపిఓ ఉమారాణి, సూపర్వైజర్ రేణుక, డిహబ్ - రోజా, డి సి పి ఓ కవిత, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది వీరబోయిన సాయిరాం , అన్ని గ్రామాల



సర్పంచులు అంగన్వాడీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు..



## నిబంధనలకు అనుగుణంగా సిబ్బంది బదిలీల ప్రక్రియ..

### -కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న సిబ్బంది బదిలీల ప్రక్రియను నిబంధనలు అనుగుణంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఈ బదిలీల ప్రక్రియలో ముందుగా ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వివరాలను సంబంధిత జిల్లా అధికారులు కలెక్టర్ కు అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న స్థానం నుండి ఇతర స్థానాలకు పారదర్శకంగా సిబ్బందిని బదిలీ చేశామని కలెక్టర్ తెలిపారు.ఈ ప్రక్రియలో ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అధిక వడ్డీలతో ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు..

### -ఎస్పీ మహేష్ బి. గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై మంగళవారం ర ఉదయం పోలీసులు 15 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈతనిఖీల్లో అక్రమ వడ్డీ వ్యాపారం,ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై 06 కేసులు నమోదు చేసి రూ.1,39,65,000/- విలువ గల వివిధ డాక్యుమెంట్లు,1,77,000 విలువ గల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మహేష్ బి. గితే ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు తమకున్న ఉన్న అత్యవసర పరిస్థితి,తాత్కాలిక అవసరాల కోసం అధిక మొతంలో అవసరాలకు మించి అధిక వడ్డీలకు అప్పు చేసి ఆతరువాత అప్పులు,అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దని అన్నారు.ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్దతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలని ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయిన అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వొచ్చు అని,అలాగే స్థానిక పోలీసు వారికి పిర్యాదు చేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.అధిక వడ్డీ రేట్లతో సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతాం

### -రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

"పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతాం" అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ?ఏఐసీసీ పిలుపు మేరకు గ్రామ, వార్డు స్థాయి కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నామని తెలిపారు. దేశంలో బీజేపీ వైఫల్యాలను, రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజల్లోకి వెళ్లి ఎండగట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

?మహిళలకు కోటి చీరల పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు, రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలు తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. జూన్ 2 నుండి ప్రారంభం కానున్న రూ. 5 లక్షల ఇందిరమ్మ ఆత్మీయ జీవిత బీమా పథకం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పథకాలను తొలగించకుండా, కొత్త పథకాలతో సంక్షేమాన్ని కొనసాగిస్తున్నందుకే అన్ని ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని అన్నారు . కూన శ్రీశైలం గౌడ్ నాయకత్వంలో అందరూ సమన్వయంతో పనిచేసి, రాబోయే రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు




## రాజన్న సిరిసిల్లలో ఘనంగా 108 అంబులెన్స్ పైలెట్స్ డే వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సమయస్ఫూర్తితో ప్రాణాలను కాపాడే '108' పైలెట్స్ సేవలను స్మరించుకుంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో 'జాతీయ 108 అంబులెన్స్ పైలెట్స్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా మేనేజర్ సవనపెల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా సేవలందిస్తున్న పైలెట్లు కేక్ కట్ చేసి,వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, అత్యవసర వైద్య సేవల రంగంలో పైలెట్లది వెలకట్టలేని పాత్ర అని అన్నారు . ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను క్షేమంగా ఆసుపత్రికి చేరవేయడంలో పైలెట్లు చూపుతున్న సమయస్ఫూర్తి, నిబద్ధత అభినందనీయమని,రాత్రింబవళ్లు విశ్రాంతి లేకుండా సేవలు అందిస్తున్న వీరు నిజమైన ప్రాణదాతలు అని అన్నారు..

?అనంతరం పైలెట్లు మాట్లాడుతూ, తమ వృత్తి పట్ల ఉన్న బాధ్యతను మరింతగా కొనసాగిస్తామని, ప్రజలకు మెరుగైన మరియు వేగవంతమైన అత్యవసర సేవలను అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని అన్నారు .

?ఈ కార్యక్రమంలో పైలెట్లు పెద్ది శ్రీనివాస్, బరిగె లక్ష్మణ్, మామిడాల ఆంజనేయులు, పోచంపల్లి పరశురాములు, వనపర్తి అనీల్, పంతగాని మహేష్, మొగిలి సుధాకర్, బరిగెల మనోజ్, నలికె నవీన్, నాగసముద్రం రాజశేఖర్, బండారి ప్రణయ్, చల్ల మధుసుదన్; టెక్నీషియన్లు జలగం సత్య సాగర్, మంత్రి కిషోర్, వడ్నాల అనిల్, చల్ల సత్తయ్య, నునావత్ మధన్, పంథం సాయికృష్ణ, మినుప స్వామి పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

## రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

**బలగం టీవి, హైదరాబాద్**



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. మంగళవారం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. ఆలియాబాద్ ప్రాంతానికి చెందిన 30 ఎకరాల భూమి నాలా కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి తహసీల్దార్ భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్టు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ తన కారు డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్నామని వెల్లడించారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎమ్మార్వోతో పాటు కీసర ఆర్డీఓ రాజేష్, పలువురు సిబ్బందిని విచారిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2024లో కూడా ఇదే శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

## అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి

## సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు

**బలగం టీవి, హైదరాబాద్**

భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఎఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఎఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్‌ఏసీ) జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఎఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఎఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ పక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ పక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ పక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

# మైలవరం ప్రాంతంలో ఈదురుగాలు బీభత్సం

## చెట్లు విరిగిపడి, ఇళ్లకు నష్టం

## నష్టాన్ని అంచనా వేసి సాయం అందిస్తామన్న ఎమ్మెల్యే

**బలగం టీవి, అమరావతి**

భారీ ఈదురు గాలుల వల్ల నష్టపోయిన వారిని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ హామీ ఇచ్చారు. మంగళవారం మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకర్లతో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈదురు గాలులకు చెట్లు విరిగిపడి గృహాలు దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. దెబ్బతిన్న గృహలను అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని చెప్పారు. విద్యుత్ స్తంభాలు పడిపోయి తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మంగళవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరి స్తారన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరగలేదని కొందరు పని పాట లేని వారు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 95 శాతం ధాన్యం కొనుగోలు చేసి.. ఆ నగదు రైతుల ఖాతాల్లో వేయడం జరిగిపోయిందని వివరించారు. గత ప్రభుత్వంలో మూడు నెలలకు కూడా ధాన్యం నగదు పడేవి కావని వైసీపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. అసలు వాస్తవాలు రైతులకు తెలుసునని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఇటీవల మైలవరంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఈ గాలులకు కరెంట్ స్తంభాలు విరిగిపడ్డాయి. భారీ చెట్లు కూడా నెలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పైవిధంగా స్పందించారు.




# పెద్ద జంతువుల కుర్బానీకి దూరంగా ఉండాలి..

## మసీదు కమిటీ ప్రతినిధులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ముస్లింలు పెద్ద జంతువుల కుర్బానీకి దూరంగా ఉండాలని, కేవలం చిన్న జంతువులను మాత్రమే కుర్బానీ చేయాలని మసీదు కమిటీ ప్రతినిధులు సూచించారు.మంగళవారం సిరిసిల్ల పట్టణంలో ని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సమీ మరియు మాజీ అధ్యక్షుడు ఎండి సత్తార్ మాట్లాడుతూ

దేశంలోని ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ముస్లిం సోదరులందరూ సంయమనంతో వ్యవహరించాలని అన్నారు.దేశంలోని ముస్లిం నాయకులు మరియు ఉలేమాలు కోరుతున్న విధంగా, ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే అంశానికి తాము మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఆవులు మరియు ఇతర పశువుల విక్రయాలను సాధ్యమైనంత వరకు నివారించాలని విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల ఈద్‌గాహ్‌లో నిర్వహించనున్న ఈద్–ఉల్–అజ్హా నమాజ్ నిర్ణయించిన సమయానికి భక్తులందరూ ఈద్‌గాహ్‌కు చేరుకుని, క్రమశిక్షణతో నమాజ్‌లో పాల్గొనాలని కోరారు.?ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సోహెల్, మాజీ మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ యూసుఫ్, ముస్తఫా, గౌరవ అధ్యక్షులు సయ్యద్ సమ్మద్, కమిటీ జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ రఫీ, మహమ్మద్ మునీర్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫయాజ్, ఎండి చాంద్ పాషా, మహమ్మద్ అమ్జాద్, షేక్ బాసు, పాషా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆత్మ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

## హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**బలగం, టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలానికి చెందిన ఆరుగురికి ఆత్మ కమిటీలో చోటు దక్కడంతో శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్.మండల కేంద్రానికి చెందిన ఆరుగురు నాయకులకు ప్రతిష్టాత్మకమైన ఆత్మ కమిటీలో స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఈరోజు నిర్వహించిన ఆత్మ కమిటీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ హాజరయ్యారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సువీన్ యాదవ్ తో పాటు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి, సర్పంచులు కనకయ్య, మోహన్, నాయికులు రమణ రెడ్డి, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

# సమగ్ర వివరాలతో జనగణనను విజయవంతం చేయాలి

## రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హెల్లికేరి

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రజల నుంచి సమగ్ర సమాచారం సేకరించి జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హెల్లికేరి అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని పూరానాపూల్ ప్రాంతంలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కే. సత్యనారాయణతో కలిసి పర్యటించిన ఆయన.. ఇంటింటికి తిరుగుతూ ఎనుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించి ప్రజల నుంచి వివరాల సేకరణ విధానాన్ని స్వయంగా తెలుసుకున్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన 34 ప్రశ్నలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. జనగణనలో ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగినట్లయితే సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ పాతబస్తీ ప్రాంత ప్రజలతో సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ.. తెలుగు, ఇంగ్లీష్ భాషలపై పట్టు ఉన్న అధికారులు, ఉద్యోగులు ప్రతి కాలనీ, డివిజన్ పరిధిలో అందుబాటులో ఉన్నారని తెలిపారు. అధికారులు స్వయంగా ప్రజలతో మాట్లాడి ఎలాంటి అపోహలు, సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. భాషాపరమైన ఇబ్బందులు ఉన్నాయనే భయంతో వెనుకడుగు వేయకుండా సమరస్య వాతావరణంలో విధులు నిర్వహించాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

జనగణన ప్రక్రియలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, సీఎం స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుగుతున్నాయని గుర్తుచేశారు.

ఇక విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జనగణన బాధ్యతల నుంచి తప్పించుకుంటున్న కొంతమంది ఉద్యోగులపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ప్రభుత్వ అత్యంత కీలక కార్యక్రమమైన జనగణనలో బాధ్యతారాహిత్యానికి తావు ఉండదని, విధులు సక్రమంగా నిర్వహించని వారిపై కఠిన చర్యలు తప్పవని సంకేతాలు వినిపిస్తున్నాయి. ప్రజలు కూడా అధికారులకు పూర్తి సహకారం అందించి సరైన సమాచారం ఇవ్వాలని భారతి హెల్లికేరి కోరారు. సమగ్ర జనగణన ద్వారానే ప్రజల అసలు అవసరాలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. ఖచ్చితమైన సమాచారం భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు బలమైన ఆధారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత, సంబంధిత విభాగాల అధికారులు, సూపర్వైజర్లు, ఎనుమరేటర్లు

# రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్ లకు గౌరవ వేతనం ప్రకటించాలి




## లైసెన్స్ సర్వేయర్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్ లకు గౌరవ వేతనం ప్రకటించాలి అని లైసెన్స్ సర్వేయర్ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్ లు మహా ధర్నా చేపట్టారు ఈ ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి శేఖర్ హాజరై మాట్లాడుతూ.లైసెన్స్ సర్వేయర్ వ్యవస్థను ప్రారంభించి సంవత్సరం పూర్తయిందని ఈ ఏడాదికాలంగా ఏ విధమైన అమలు జరిగింది ఎలాంటి ప్రాణాలికతో తీసుకువచ్చారు ఎందుకు తీసుకువచ్చారు అనే విషయాలు ఇప్పటికి స్పష్టత లేదన్నారు. తద్వారా 6500 లైసెన్స్ సర్వేయర్

కుటుంబాలు పూర్తిగా ఆర్థికంగా దెబ్బతిన్నాయని గతంలో పలుమార్లు ఈ వ్యవస్థపై గైడ్‌లైన్స్ కోరాము. కానీ ఇప్పటివరకు సరైన మార్గదర్శకాలు ఇవ్వలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగినా పని ఇవ్వడం లేదన్నారు. రెవెన్యూ వ్యవస్థ తెలంగాణలో అత్యంత కీలకమైనది. కానీ దానిని పట్టించుకోకుండా ఈ విధంగా వ్యవహరించడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తామని లైసెన్స్ వ్యవస్థ తీసుకువచ్చారు. కానీ వాస్తవానికి దీనివల్ల లాభపడింది కొందరు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యవస్థలోని కొందరు మాత్రమే. మిగతా వారందరికీ ఉపాధి లేదు, ఆదాయం లేదు.

ఈ వ్యవస్థ ద్వారా ఒక్క రూపాయి కూడా మా చేతికి రాలేదు. పని కూడా కల్పించలేదు.

తెలంగాణలో కోట్లాది ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థను కేవలం 6500 మందితో పరిమితం చేశారు అని తెలిపారు.మేము ఆఫీసులకు వెళ్లి అడిగితే లోపలికి కూడా అనుమతించని పరిస్థితి ఉంది.

కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు గౌరవ వేతనం ప్రకటించాలి. స్థిరమైన పని ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. హెల్త్ కార్డులు ఇవ్వాలి. లైసెన్స్ వ్యవస్థను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. ఎకరం భూమి కొలిస్తే కేవలం 50 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని . 50 రూపాయలతో కుటుంబం నడవదు. కనీసం 600 మందికి నెలకు 30 వేల జీతం ప్రకటిస్తే, మేము ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. మా జీవితాలు నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రంగు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి టీడీపీ మహానాడు

## వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ

## పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు

**బలగం టీవి, అమరావతి**

టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ,గురువారాల్లో ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో

అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.


# కర్నాటకంపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

## డికెకు పగ్గాలు అప్పగించేందుకు రంగం సిద్ధం

## సిద్ధరామయ్యను రాజ్యసభకు పంపే యత్నం?

**బలగం టీవి, న్యూఢిల్లీ**

కర్ణాటకలో నాయకత్వ పోరుకు తెరపడనున్నట్టు కాంగ్రెస్ పార్టీ వర్గాల సమాచారం. సిఎం మార్పు లేదని బయటకు చెబుతున్నా, డికె శివకుమార్‌కు పగ్గాలు అందించేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సిద్ధరామయ్య ప్రభుత్వం ఇటీవల మూడేళ్ల పూర్తి చేసుకున్న నేపథ్యంలో మరోసారి నాయకత్వ సమస్య తెరపైకి వచ్చింది. పార్టీ అధిష్టానం సిద్ధరామయ్య, డీకేలను న్యూఢిల్లీకి పిలవడంతో ఎట్టకేలకు సమస్య కొలిక్కి వచ్చినట్టు చెబుతున్నారు. ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అధిష్టానం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసి కేంద్రంలో కీలక పాత్ర పోషించాల్సిందిగా కోరిందని తెలుస్తోంది. తగిన సమయం తీసుకుని నిర్ణయం చెప్పాల్సిందిగా ఆయనకు సూచించినట్టు చెబుతున్నారు. దీంతో సిద్ధరామయ్య రెండు, మూడు రోజుల్లో రాజీనామా చేసే అవకాశాలున్నాయని అంటున్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే ఢిల్లీ సమావేశంలో చర్చించినట్టు కాంగ్రెస్ అధిష్టానం చెబుతున్నప్పటికీ ఈ సమావేశంలో రాష్ట్రంలో నాయకత్వ మార్పిడిపై ప్రధానంగా చర్చ జరిగినట్టు చెబుతున్నారు. డీకే శివకుమార్‌కు అధికారాన్ని (సీఎం) బదిలీ చేసేందుకు అధిష్టానం ఏకగ్రీవంగా మద్దతు పలికిందని పార్టీ వర్గాలు తెలిపాయి. సుమారు 6 గంటల సేపు జరిగిన ఈ సమావేశంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో పాటు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రణ్‌దీప్ సూర్జేవాలా పాల్గొన్నారు. కర్ణాటకలో జరిగిన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించింది. సీఎం పదవిని సిద్ధరామయ్య చేపట్టారు. అయితే డీకే శివకుమార్‌తో



రెండున్నరేళ్ల చొప్పున పదవీకాలం పంచుకునేందుకు అప్పట్లో నిర్ణయం జరగిందని ఆయన వర్గం చెబుతోంది. ఈ వాదనను సిద్ధరామయ్య తోసిపుచ్చారు. ఐదేళ్లు తానే సీఎంగా ఉంటానని, అయితే అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని తరచు చెబుతున్నారు.

# చార్మినార్‌లో భాగ్యలక్ష్మి అమ్మవారికి టీఆర్ఎస్ ప్రత్యేక పూజలు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామానికి నీళ్లు, నిధులు, నియామకాలు, ఉపాధి అవకాశాలు, ఉచిత విద్య అందించడమే తెలంగాణ రక్షణ సేన ముఖ్య లక్ష్యమని టీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ సాయి మహేష్ పేర్కొన్నారు. మంగళవారం చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జెండా పండుగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డివిజన్ వారీగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పరిశీలకులతో కలిసి జెండా పండుగ కార్యక్రమాలను చేపట్టి పార్టీ భావజాలం, ప్రజా కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాధాకృష్ణ, చాంద్రాయణగుట్ట నాయకుడు అంబటి రాజేష్, యాకుత్‌పురా ఇన్‌చార్జ్ శైలజ గౌడ్, బహుదూర్‌పుర్ ప్రాంత నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఫైనల్‌కు దూసుకెళ్లిన ఆర్‌సీబీ



- గుజరాత్‌పై 92 పరుగుల భారీ విజయం
- రజత్ పాటిదార్ విధ్వంసం..

బ్యాటింగ్, బౌలింగ్‌లో ఆర్‌సీబీ ఆధిపత్యం

**బలగం టీవీ, ధర్మశాల**

ఐపీఎల్-2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫైనల్‌కు ఘనంగా అర్హత సాధించింది. మంగళవారం ధర్మశాల వేదికగా జరిగిన క్వాలిఫయర్-1లో ఆర్‌సీబీ 92 పరుగుల భారీ తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన బెంగళూరు రెండో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది.ఈ ఓటమితో గుజరాత్ టైటాన్స్‌కు క్వాలిఫయర్-2 రూపంలో మరో అవకాశం లభించింది. బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే ఎలిమినేటర్ విజేతతో గుజరాత్ తలపడనుంది.

**రజత్ పాటిదార్ తుఫాన్ ఇన్నింగ్స్**

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోర్ సాధించింది. కెప్టెన్ రజత్ పాటిదార్ కేవలం 33 బంతుల్లో 93 పరుగులతో అజేయంగా నిలిచి విధ్వంసం సృష్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు, 9 భారీ సిక్స్‌లు ఉన్నాయి. విరాట్ కోహ్లీ 25 బంతుల్లో 43 పరుగులు, కృనాల్ పాండ్యా 28 బంతుల్లో 43 పరుగులతో వేగంగా ఆడారు. గుజరాత్ బౌలర్లలో కగిసో రబాడ, జాసన్ హోల్డర్ రెండేసి వికెట్లు తీశారు.

**ఆర్‌సీబీ బౌలర్ల ధాటికి కుప్పకూలిన గుజరాత్**

255 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఆరంభంలోనే భారీ షాక్ తగిలింది. ఆరెంజ్ క్యాప్ హోల్డర్ సాయి సుదర్శన్ హిట్‌వికెట్‌గా వెనుదిరగగా, శుభ్‌మన్ గిల్‌ను భువనేశ్వర్ కుమార్ క్లీన్ బౌల్డ్ చేశాడు. జోస్ బట్లర్ దూకుడుగా ఆడే ప్రయత్నం చేసినా జోష్ హేజిల్‌వుడ్ అద్భుత బంతికి ఔటయ్యాడు. రసిక్ సలామ్ ఒకే ఓవర్‌లో నిశాంత్ సింధు, జాసన్ హోల్డర్ వికెట్లు తీసి గుజరాత్‌ను కష్టాల్లోకి నెట్టాడు. పవర్‌ప్లే ముగిసే సరికి గుజరాత్ ఐదు వికెట్లు కోల్పోయింది.

**పరువు కాపాడిన రాహుల్ తెవాటియా**

మిగతా బ్యాటర్లు విఫలమైనా రాహుల్ తెవాటియా ఒంటరి పోరాటం చేశాడు. 43 బంతుల్లో 68 పరుగులతో హాఫ్ సెంచరీ నమోదు చేసి జట్టుకు కొంత గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. జోస్ బట్లర్ 29 పరుగులతో పర్వాలేదనిపించాడు.

అయితే ఆర్‌సీబీ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. జాకోబ్ డఫీ మూడు వికెట్లు తీయగా, భువనేశ్వర్ కుమార్, రసిక్ సలామ్, కృనాల్ పాండ్యా రెండేసి వికెట్లు పడగొట్టారు. హేజిల్‌వుడ్‌కు ఒక వికెట్ దక్కింది.

# ఎలిమినేటర్‌కు సిద్ధమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ రాజస్థాన్

- లీగ్ మ్యాచ్‌లలో రెండు సార్లు రాజస్థాన్‌ను ఓడించిన హైదరాబాద్
- ఓడితే ఇంటికే కావడంతో కీలక పోరు
- అందరి దృష్టి అభిషేక్ వైభవ్ లపైనే....

**బలగం టీవీ, ముల్లాన్‌పూర్**

ఇక తప్పులు చేయడానికి అస్సలు ఛాన్స్ లేదు. ఓడిపోతే లగేజ్ సర్దుకుని ఇంటికి వెళ్లడమే. ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన ముగింపు దశకు చేరుకుంది. లీగ్ దశలో అద్భుత ప్రదర్శన చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఇప్పుడు ఎలిమినేటర్ పోరులో ముఖాముఖి తలపడేందుకు సిద్ధమయ్యాయి. లీగ్ పట్టికలో మూడో స్థానంలో నిలిచిన పాట్ కమిన్స్ సారథ్యంలోని సన్‌రైజర్స్ హైదరాబాద్, నాలుగో స్థానాన్ని దక్కించుకున్న రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ మధ్య ఈ హై-వోల్టేజ్ ఎలిమినేటర్ మ్యాచ్ నేటి రాత్రి జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫైయర్ 2కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఈ సీజన్ లీగ్ దశలో రాజస్థాన్‌పై సన్‌రైజర్స్ పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ హైదరాబాద్ జట్టు విజయం సాధించడంతో మానసికంగా సన్‌రైజర్స్ బలంగా ఉంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ వంటి విధ్వంసకర బ్యాటర్లతో హైదరాబాద్ బ్యాటింగ్ లైన్ అప్ పటిష్టంగా కనిపిస్తోంది. మరోవైపు యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ ఫామ్‌లోకి రావడం రాజస్థాన్ రాయల్స్‌కు కలిసొచ్చే అంశం. అయితే, ముల్లన్‌పూర్ మైదానంలో రాజస్థాన్ జట్టుకు మంచి రికార్డు ఉంది. ఈ సీజన్‌లో ఇక్కడ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ రాజస్థాన్ విజయం సాధించడం విశేషం. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌కు వేదికైన మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ముల్లన్‌పూర్) బ్యాటింగ్‌కు స్వర్గధామంగా పేరుగాంచింది. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లలో బ్యాటర్లు పరుగుల వరద పారించారు. చిన్న బౌండరీలు, వేగవంతమైన ఔట్‌ఫీల్డ్ కారణంగా బంతి క్షణాల్లో సరిహద్దులు దాటుతోంది. ఇప్పటికే ఈ మైదానంలో 220కి పైగా భారీ స్కోర్లు కూడా ఎంతో సులువుగా ఛేజ్ అయ్యాయి. మ్యాచ్ ప్రారంభంలో పేస్ బౌలర్లకు కాస్త స్వింగ్ లభించినప్పటికీ, సమయం గడిచేకొద్దీ పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుని, రాత్రి వేళ చేజింగ్ వైపు మొగ్గు చూపే అవకాశం స్పష్టంగా ఉంది. ఐపీఎల్ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య రికార్డులను పరిశీలిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ స్పష్టమైన ఆధిక్యంలో కనిపిస్తోంది. ఇరు జట్లు ఇప్పటివరకు 23 మ్యాచ్‌ల్లో ముఖాముఖి తలపడగా, అందులో సన్‌రైజర్స్ ఏకంగా 14 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్ కేవలం 9 మ్యాచ్‌ల్లో మాత్రమే గెలుపొందింది. అంతేకాదు, ఈ 2026 సీజన్ లీగ్ దశలో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ పాట్ కమిన్స్ నేతృత్వంలోని హైదరాబాద్ జట్టు రాజస్థాన్‌ను చిత్తు చేయడం విశేషం. హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో 57 పరుగుల తేడాతో, జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ ఘనవిజయం సాధించి మానసికంగా బలంగా ఉంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ లతో పాటు ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ రూపంలో విధ్వంసకర బ్యాటింగ్ లైన్ అప్ ఉంది. ముఖ్యంగా క్లాసెన్ ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. బౌలింగ్‌లో ఇషాన్ మలింగ వికెట్ల వేట కొనసాగిస్తున్నాడు. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ జట్టు 15 ఏళ్ల సంచలన కుర్రాడు వైభవ్ సూర్యవంశీపై భారీగా ఆశలు పెట్టుకుంది. జైపూర్‌లో హైదరాబాద్‌పై కేవలం 36 బంతుల్లోనే శతకం బాదిన సూర్యవంశీ ఈ మ్యాచ్‌లోనూ కీలకం కానున్నాడు. అతనికి తోడుగా యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, రియాన్ పరాగ్ లతో రాజస్థాన్ బ్యాటింగ్ బలంగా ఉంది. బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ పవర్‌ప్లేలో వికెట్లు తీయడంపైనే రాజస్థాన్ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ దూకుడుకు, రాజస్థాన్ రాయల్స్ వ్యూహాత్మక ఆటతీరుకు మధ్య జరగబోయే ఈ పోరు క్రికెట్ ప్రేమికులకు కంటిమీద కునుకు లేకుండా చేయడం ఖాయం. పంజాబ్ పిచ్‌పై మొదట్లో పేసర్లకు స్వింగ్ లభించే అవకాశం ఉన్నందున టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. మరి రేపు హైదరాబాద్ కేక పెడుతుందో, రాజస్థాన్ రాయల్స్ ప్రతీకారం తీర్చుకుంటుందో చూడాలి!




**రెండు జట్ల అంచనా తుది జట్లు (ప్లేయింగ్ 11):**

సన్‌రైజర్స్ హైదరాబాద్: ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, లియామ్ లివింగ్‌స్టోన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), ఇషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్, శివాంగ్ కుమార్, జీషన్ అన్సారీ.

రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), షిమ్రాన్ హెట్‌మైర్, రవీంద్ర జడేజా, డోనోవన్ ఫెరీరా, జోఫ్రా ఆర్చర్, బ్రిజేష్ శర్మ, నాండ్రే బర్గర్, యష్ రాజ్ పుంజా.

# ఐపీఎల్ 2016 మ్యాజిక్ రిపీట్ అవుతుందా?

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగిసి ప్లేఆఫ్స్ సమరానికి తెరలేవడంతో క్రికెట్ లవర్స్ ఫైనల్ పోరు కోసం మరింత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచి ఎలిమినేటర్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ సందర్భంలో ప్రతి ఒక్కరికీ పదేళ్ల కిందట ఆరెంజ్ ఆర్మీ సృష్టించిన ఒక అద్భుతమైన రికార్డు గుర్తుకు వస్తోంది. ఐపీఎల్ చరిత్రలో ఎలిమినేటర్ నుంచి వచ్చి కప్ కొట్టిన ఏకైక జట్టుగా హైదరాబాద్‌కు ఒక ప్రత్యేకమైన రికార్డు ఉంది. అయితే ఆ సీజన్‌లో హైదరాబాద్ ఎవరితో గెలిచింది, అసలు ఆ ప్లేఆఫ్స్ లెక్కలు ఏంటి, ఎవరెవరిని ఓడించుకుంటూ వచ్చి ఛాంపియన్‌గా నిలిచింది . ఐపీఎల్ 2016లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తన అద్భుత కెప్టెన్సీతో ముందుండి నడిపించాడు. కేవలం కెప్టెన్‌గానే కాకుండా ఆ సీజన్‌లో బ్యాట్‌తోనూ రికార్డు స్థాయి పరుగులతో వార్నర్ చెలరేగిపోయాడు. ఆ ఏడాది లీగ్ దశ ముగిసేసరికి హైదరాబాద్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఫైనల్‌కు వెళ్లడానికి కేవలం ఒకే ఒక్క అవకాశం ఉండే అత్యంత కష్టమైన ఎలిమినేటర్ దారిలో సన్‌రైజర్స్ ప్రయాణం మొదలైంది.2016 ప్లేఆఫ్స్‌లో భాగంగా హైదరాబాద్ జట్టు తన మొదటి మ్యాచ్‌ను ఢిల్లీ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడింది. ఈ చావో రేవో ఎలిమినేటర్ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. యువరాజ్ సింగ్ వేగంగా 44 పరుగులు చేసి జట్టుకు మంచి స్కోరు అందించాడు. ఆ తర్వాత లక్ష్య ఛేధనలో కోల్‌కతాను భువనేశ్వర్ కుమార్, హెన్రిక్స్‌ల బౌలింగ్‌తో కట్టడి చేసిన హైదరాబాద్ జట్టు, కేకేఆర్‌ను 140 పరుగులకే పరిమితం చేసింది. 22 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి క్వాలిఫైయర్-2లోకి అడుగు పెట్టింది.కోల్‌కతాను ఓడించిన జోష్‌లో ఉన్న హైదరాబాద్‌కు క్వాలిఫైయర్-2లో సురేష్ రైనా నేతృత్వంలోని గుజరాత్ లయన్స్ జట్టు ఎదురైంది. ఢిల్లీలోనే జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ లయన్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 162 పరుగులు చేసింది. ఆ తర్వాత 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు ఒక దశలో 117 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి తీవ్రమైన ఒత్తిడిలో పడింది. కానీ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఒంటి పోరాటం చేస్తూ 58 బంతుల్లోనే 93 పరుగులు చేసి, మరో 4 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించి ఫైనల్ బెర్త్ ఖరారు చేశాడు.ఇక 2016 మే 29న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఐపీఎల్ చరిత్రలోనే ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. విరాట్ కోహ్లీ భీకరమైన ఫామ్‌లో ఉన్న ఆర్సీబీని వారి సొంత మైదానంలో ఢీకొట్టడం అంటే అప్పట్లో మామూలు విషయం కాదు. ఈ హైవోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు డేవిడ్ వార్నర్, బెన్ కటింగ్‌ల మెరుపులతో ఏకంగా 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఉత్కంఠ పోరులో చివరకు భువనేశ్వర్ కుమార్ అద్భుత బౌలింగ్‌తో ఆర్సీబీని కట్టడి చేసి 8 పరుగుల తేడాతో చరిత్రాత్మక విజయాన్ని, మొదటి ఐపీఎల్ ట్రోఫీని అందించాడు.అయితే పదేళ్ల తరువాత మళ్ళీ హైదరాబాద్ జట్టు అలాంటి పరిస్థితుల్లోనే ఫైనల్ సమరానికి సిద్ధమవ్వడం విశేషం. ఈ ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడానికి సరికొత్త ఫైట్స్ రెడీగా ఉన్నాయి. ఆరెంజ్ ఆర్మీ తన మొదటి ఎలిమినేటర్ ఫైట్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడాల్సి ఉంటుంది. లీగ్ స్టేజ్‌లో హైదరాబాద్ బ్యాటర్లు భీకరమైన ఫామ్‌లో ఉన్నందున ఈ మ్యాచ్‌లో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ ఈ మొదటి ఫైట్‌లో రాజస్థాన్‌పై గెలిస్తే, ఆ తర్వాత జరిగే క్వాలిఫైయర్ 2లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లేదా గుజరాత్ టైటాన్స్ జట్లలో ఒకరితో హైదరాబాద్ పోరాడాల్సి ఉంటుంది. క్వాలిఫైయర్-1లో ఓడిపోయిన జట్టు ఇక్కడికి వస్తుంది కాబట్టి ఆ ఫైట్ ఎంతో ఆసక్తికరంగా మారనుంది.క్వాలిఫైయర్-2లో కూడా గెలిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్ నేరుగా ఫైనల్‌లో అడుగు పెడుతుంది. అక్కడ టైటిల్ పోరులో మళ్లీ క్వాలిఫైయర్-1లో గెలిచి ఆల్రెడీ ఫైనల్‌లో వెయిట్ చేస్తున్న ఆర్సీబీ లేదా గుజరాత్‌తోనే హైదరాబాద్ ఫైనల్ ఫైట్ చేయాల్సి ఉంటుంది. అంటే ఈసారి కూడా కప్ కొట్టాలి అంటే హైదరాబాద్ బ్యాక్ టు బ్యాక్ మూడు భారీ మ్యాచ్‌లలో గెలవాల్సిందే. ఆనాడు డేవిడ్ వార్నర్ ఆస్ట్రేలియా ప్లేయర్‌గా జట్టును ఛాంపియన్‌గా నిలబెడితే, ఇప్పుడు మరో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఆరెంజ్ ఆర్మీని నడిపిస్తున్నాడు. మరి హార్డ్ మ్యాచుల్లో అన్నింటిలోనూ గెలిచి ఆనాటి 2016 మ్యాజిక్‌ను కమిన్స్ సేన రిపీట్ చేస్తుందో లేదో చూడాలి మరి.

## పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ గుడ్ బై..?




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ప్రయాణం విచిత్రంగా ముగిసింది. తిరుగులేని ఆధిపత్యంతో ఆరంభంలో వరుసగా 7 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించి సరికొత్త చరిత్రను లిఖించిన పంజాబ్.. ఆ తర్వాత వరుసగా 6 మ్యాచ్‌ల్లో ఓడి ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిదారి పట్టింది.ఆఖరి లీగ్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై అద్వితీయమైన విజయాన్ని అందుకున్నా.. ప్లేఆఫ్స్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయింది. పంజాబ్ ఆశలను ముంబై ఇండియన్స్ చిదిమేసింది. రాజస్థాన్ రాయల్స్ చేతిలో ముంబై ఓడిపోవడంతో పంజాబ్ ఇంటిబాట పట్టింది.అయితే ఈ సీజన్ వైఫల్యం నేపథ్యంలో పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ గుడ్‌బై చెబుతాడనే ప్రచారం జోరు అందుకుంది. ఈ సీజన్‌ను ఉద్దేశించి అయ్యర్ చేసిన ట్వీట్ ఈ ప్రచారానికి బలం చేకూర్చుతుంది. ఈ సీజన్‌లో అయ్యర్ అటు బ్యాటర్‌గా.. ఇటు కెప్టెన్‌గా సత్తా చాటాడు. కానీ ఆశించిన ఫలితాన్నిఅందించలేకపోయాడు. మూడు రోజుల తర్వాత పంజాబ్ నిష్క్రణపై శ్రేయస్ అయ్యర్ స్పందించాడు.'ప్రతీ పరుగు.. ప్రతీ క్షణం.. ప్రతీ పోరాట.. ఈ అధ్యాయం కృతజ్ఞతతో ముగిసింది. ఆకలి, కసితో తదుపరి అధ్యాయం మొదలవుతుంది.' శ్రేయస్ అయ్యర్ ట్వీట్ చేశాడు. అధ్యాయం ముగిసిందని పేర్కొనడంతో పంజాబ్‌కు వీడ్కోలు పలుకుతున్నాడా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అయితే అలాంటిది ఏం లేదని, తదుపరి సీజన్‌కు రెట్టించిన ఉత్సాహం, ఆత్మవిశ్వాసంతో తిరిగి వస్తామని అయ్యర్ చెప్పకనే చెప్పాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన అయ్యర్ 498 పరుగులు చేశాడు. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అజేయ శతకంతో చెలరేగాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్ల భారీ ధరకు శ్రేయస్ అయ్యర్‌ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అందుకు తగ్గట్లుగానే అయ్యర్ సత్తా చాటాడు. దశాబ్దకాలం తర్వాత పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ చేర్చాడు. ఫైనల్లో ఆర్‌సీబీ చేతిలో ఓడి తృటిలో టైటిల్ చేజార్చుకున్నాడు. పంజాబ్ కింగ్స్‌ను వెనక్కి నెట్టి ప్లే ఆఫ్స్ చేరిన రాజస్థాన్ రాయల్స్.. మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎలిమినేటర్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫయర్-2కు అర్హత సాధించనుంది.




# ఎవరు గెలిచినా వాళ్లకు రెండో కప్పు

**బలగం టీవీ, హైదరాబాద్**

తొలి క్వాలిఫయర్?లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు- గుజరాత్ టైటాన్స్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇక బుధవారం ఎలిమినేటర్? మ్యాచ్?లో సన్?రైజర్స్ హైదరాబాద్- రాజస్థాన్ రాయల్స్ జట్లు తలపడనున్నాయి. అయితే ఈసారి ప్లేఆఫ్స్?కు అర్హత సాధించి జట్ల మధ్య ఓ ఆసక్తికర పాయింట్ ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్?రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ఈ లీగ్?లో టాప్? 4లో నిలిచి ప్లేఆఫ్స్?కు దూసుకొచ్చాయి. ఇక టోర్నీలో ఛాంపియన్?గా నిలిచేందుకు అన్ని జట్లు తీవ్రంగా సన్నద్ధం అవుతున్నాయి. అయితే ఇక్కడే ఓ ఆసక్తికర పాయింట్ దాగి ఉంది. ఈ నాలుగు జట్లలో ఏ ఫ్రాంచైజీ నెగ్గినా, ఐపీఎల్ టైటిల్?ను రెండోసారి దక్కించుకున్న టీమ్?గా నిలుస్తాయి. అంటే గడిచిన 18 సీజన్లలో ఈ నాలుగు జట్లు ఆయా సీజన్లలో విజేతలుగా నిలిచాయన్నమాట!ఐపీఎల్ ప్రారంభ సీజన్? 2008లోనే రాజస్థాన్ అద్భుతం చేసింది. షేన్ వార్న్ నేతృత్వంలోని ఈ జట్టు ఐపీఎల్? తొలి విజేతగా నిలిచింది. అయితే ఆశ్చర్యం ఏంటంటే ఆ తర్వాత 17 సీజన్లలో రాజస్థాన్ మళ్లీ కప్పు నెగ్గలేదు. ఈ మధ్య కాలంలో ఎందరో కెప్టెన్లు, ప్లేయర్లు మారినప్పటికీ రాజస్థాన్?కు రెండో కప్పు అందడం లేదు. ఈసారి యువ కెప్టెన్ రియాన్ పరాగ్ నాయకత్వంలో టైటిల్ అందుకోవాలని ఆశిస్తోంది.2013లో ఐపీఎల్?లో అరంగేట్రం చేసిన సన్?రైజర్స్ హైదరాబాద్ మూడేళ్లలోనే ఛాంపియన్?గా నిలిచింది. సరిగ్గా 10ఏళ్ల కిందట 2016 ఎడిషన్?లో ఆరెంజ్ ఆర్మీ టైటిల్ నెగ్గింది. డేవిడ్ వార్నర్ కెప్టెన్సీలో ఆడిన సన్?రైజర్స్ ఫైనల్?లో ఆర్సీబీని ఓడించి తొలిసారి కప్పును ముద్దాడింది. ఆ తర్వాత 2018, 2024లో ఫైనల్? దాకా వచ్చినా టైటిల్ అందలేదు. ఈసారి కమిన్స్? కెప్టెన్సీలో కప్పు పట్టేయాలని ఆరెంజ్ ఆర్మీ కసిగా ఉంది.2022లో రెండు కొత్త జట్లు ఐపీఎల్?లో ఎంట్రీ ఇచ్చాయి. ఒకటి లఖ్?నవూ సూపర్ జెయింట్స్ కాగా, రెండోది గుజరాత్ టైటాన్స్. హార్దిక్ పాండ్య నాయకత్వంలో గుజరాత్ జట్టు తొలి సీజన్?లోనే (2022) ఛాంపియన్?గా నిలిచి అందరినీ ఆశ్చర్యపర్చింది. ఆ ఫైనల్?లో రాజస్థాన్?పై హార్దిక్ సేన నెగ్గింది. ఇక 2023లోనూ ఫైనల్? చేరింది. కానీ టైటిల్ ఫైట్?లో సీఎస్కేపై ఓడిపోయింది.స్టార్ ఫ్రాంచైజీ ఆర్సీబీ 18ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ గత సీజన్?లో తొలిసారి కప్పును ముద్దాడింది. ఫైనల్?లో పంజాబ్?ను ఓడించి ఎదురుచూపులకు ఫుల్?స్టాప్ పెడుతూ టైటిల్ అందుకుంది. ఇక ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్? హోదాలో బరిలోకి దిగిన ఆ జట్టు అదిరే ప్రదర్శనతో అదరగొడుతోంది. ప్లేఆఫ్స్?లోనూ అదే ప్రదర్శనతో రాణించి వరుసగా రెండో టైటిల్ నెగ్గాలని ఉవ్విళ్లూరుతోంది.ఇలా ఈ నాలుగు జట్లు కూడా ఇప్పటికే ఐపీఎల్?లో ఒక్కోసారి టైటిల్ నెగ్గాయి. ఇప్పుడు ఎవరు గెలిచినా వాళ్లకు అది రెండో కప్పు అవుతుంది. ఇప్పటిదాకా ఐపీఎల్?లో ఒకటికంటే ఎక్కువసార్లు టైటిల్ సాధించిన జట్లు మూడు మాత్రమే ఉన్నాయి. అవి ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ (చెరో ఐదుసార్లు), కోల్?కతా నైట్?రైడర్స్ (రెండుసార్లు) ఫ్రాంచైజీలు. ఇప్పుడు ఇందులో ఏ జట్టు నెగ్గినా రెండుసార్లు కంటే ఎక్కువ టైటిళ్లు సాధించిన జట్లుగా ముంబయి, సీఎస్కే, కోల్‌కతాతో చేరుతుంది.

# కోహ్లీ సరికొత్త రికార్డు..




**బలగం టీవీ, హైదరాబాద్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ఖాతాలో మరో అద్భుతమైన మైలురాయి చేరింది. ఐపీఎల్ ప్రారంభమైన 2008 సీజన్ నుంచి ఆర్‌సీబీ జట్టుకు నమ్మకమైన పిల్లర్‌గా నిలిచిన కోహ్లీ, ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాడు. మే 26న ధర్మశాల వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న ఈ కీలక పోరులో బరిలోకి దిగడం ద్వారా, ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన దిగ్గజాల సరసన కోహ్లీ చోటు సంపాదించుకున్నాడు.ఐపీఎల్ చరిత్రను తిరగేస్తే విరాట్ కోహ్లీ పేరిట లేని రికార్డు అంటూ లేదు. ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీనే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతను మొత్తం 9218 పరుగులు చేసి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు (76 హాఫ్ సెంచరీలు) చేసిన రికార్డు కూడా కోహ్లీ పేరిటే ఉంది. అతని తర్వాత డేవిడ్ వార్నర్ ఉండగా, ప్రస్తుతం ఆడుతున్న యాక్టివ్ ప్లేయర్లలో కేఎల్ రాహుల్ 51 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ గణాంకాలే ఐపీఎల్‌లో కోహ్లీ సృష్టించిన సామ్రాజ్యానికి అద్దం పడుతున్నాయి.తాజాగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న క్వాలిఫైయర్ 1 మ్యాచ్‌తో కలిపి విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో 18వ ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ ఆడుతున్నాడు. దీనితో అతను శిఖర్ ధావన్, దినేష్ కార్తీక్, కీరన్ పొలార్డ్ వంటి దిగ్గజాల రికార్డును సమం చేశాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 28 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (24 మ్యాచ్‌లు), సురేష్ రైనా (24 మ్యాచ్‌లు), రోహిత్ శర్మ (23 మ్యాచ్‌లు), అంబటి రాయుడు (23 మ్యాచ్‌లు), రవీంద్ర జడేజా (23 మ్యాచ్‌లు), డ్వేన్ బ్రావో (19 మ్యాచ్‌లు) ఉన్నారు. ఇప్పుడు వారి వెనుకే విరాట్ కోహ్లీ కూడా చేరిపోయాడు. ఐపీఎల్ నాకౌట్ స్టేజ్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శనపై భిన్నమైన రికార్డులు ఉన్నాయి. ఆర్‌సీబీ తరఫున అతను ఇప్పటివరకు 4 ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లు ఆడాడు. ఫైనల్స్ లో కోహ్లీ 34.75 సగటుతో, 126.36 స్ట్రైక్ రేట్‌తో పర్వాలేదనిపించేలా రాణించాడు. అయితే ఎలిమినేటర్ మ్యాచ్‌ల విషయానికి వస్తే మాత్రం కోహ్లీ ట్రాక్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఆడిన 5 ఎలిమినేటర్ మ్యాచ్‌లలో అతను కేవలం 23.00 సగటు, 108.49 పేలవమైన స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేశాడు. ఈ స్లో బ్యాటింగ్ కారణంగా గతంలో ఆర్‌సీబీ కొన్ని కీలక మ్యాచ్‌లలో ఓటమి పాలుకావాల్సి వచ్చింది. పాత రికార్డులు ఎలా ఉన్నప్పటికీ, ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో మాత్రం విరాట్ కోహ్లీ వీరవిహారం చేస్తున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచ్‌లలో అతను 50కి పైగా అద్భుతమైన సగటుతో, 162.03 స్కై-హై స్ట్రైక్ రేట్‌తో పరుగుల వరద పారించాడు. ఆర్‌సీబీ జట్టు వరుస విజయాలతో ప్లేఆఫ్స్ క్వాలిఫైయర్ 1 కి చేరుకోవడంలో కోహ్లీ బ్యాటింగే ప్రధాన బలమైంది. ఇదే ఫామ్‌ను గుజరాత్‌పై కూడా కొనసాగించి, ఆర్‌సీబీని ఫైనల్‌కు చేర్చడమే లక్ష్యంగా కింగ్ కోహ్లీ బరిలోకి దిగాడు.

# రియాన్ పరాగ్, వైభవ్ సూర్యవంశీ మధ్య కోల్డ్ వార్..?

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ ఉత్కంఠ రేపుతున్న వేళ రాజస్థాన్ రాయల్స్ క్యాంప్‌లో తీవ్ర కలకలం రేగింది. మైదానంలో పరుగుల వరద పారిస్తున్న సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్‌గా మారింది. ముంబై విమానాశ్రయంలో ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ ఆసక్తికర ఘటనే ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ తర్వాత ఈ ఏడాది ప్లేఆఫ్స్ చేరిన నాలుగో జట్టుగా రాజస్థాన్ రాయల్స్ నిలిచింది. బుధవారం న్యూ చండీగఢ్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే ఎలిమినేటర్ మ్యాచ్ కోసం జట్టు ముంబై నుంచి చండీగఢ్‌కు విమానంలో ప్రయాణమైంది. లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించిన ఉత్సాహంలో ఉన్న రాయల్స్ ఆటగాళ్లు విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు ఈ వివాదం చోటుచేసుకుంది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆటగాళ్ల ఫోటోలను తీసేందుకు మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు ఎగబడ్డారు. ఈ క్రమంలో ఒక ఫోటోగ్రాఫర్ కెప్టెన్ రియాన్ పరాగ్, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలను కలిసి ఒక ఫోటో ఇవ్వాల్సిందిగా కోరాడు. దీనికి పరాగ్ తనదైన శైలిలో స్పందిస్తూ, “మేమేమీ సినిమా స్టార్లం కాదు” అంటూ ఫోటో ఇవ్వడానికి నిరాకరించాడు. పరాగ్ చేసిన ఈ వ్యాఖ్య పక్కనే ఉన్న 15 ఏళ్ల వైభవ్‌కు నచ్చలేదు. దాంతో ఆయన తన కెప్టెన్‌ను ఎంతో సీరియస్‌గా, కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఈ చూపుల యుద్ధానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తోందనే ప్రచారం ఊపందుకుంది.ఈ సీజన్లో రాజస్థాన్ రాయల్స్ జట్టును వైభవ్ సూర్యవంశీ ఒంటిచేత్తో ముందుకు నడిపిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జస్ప్రీత్ బుమ్రా, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను నెట్ బౌలర్లకంటే హీనంగా బాదేస్తున్నాడు. తన కెరీర్లో రెండో ఐపీఎల్ సీజన్ ఆడుతున్న ఈ ఎడంచేతి వాటం బ్యాటర్.. 232.27 స్ట్రైక్ రేట్‌తో దాదాపు 600 పరుగులు సాధించాడు. యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ రాణిస్తున్నప్పటికీ, వైభవ్ ఆడే ఇన్నింగ్స్ జట్టు విజయాల్లో కీలక తేడాను చూపిస్తున్నాయి. నిజానికి వైభవ్ సూర్యవంశీ ఇంతలా రాణించడం వెనుక రియాన్ పరాగ్ ప్రోత్సాహం ఎంతో ఉంది. సంజూ శామ్సన్ ఈ సీజన్లో చెన్నై జట్టుకు మారడంతో, రాజస్థాన్ సారథ్య బాధ్యతలను పరాగ్ అందుకున్నాడు. పరాగ్ నాయకత్వంలోనే వైభవ్ గత సీజన్లో అరంగేట్రం చేశాడు. కుమార్ సంగక్కర నేతృత్వంలోని మేనేజ్‌మెంట్ కూడా పరాగ్ కెప్టెన్సీని ఎంతగానో సమర్థించింది. మైదానంలో వైభవ్‌కు స్వేచ్ఛగా ఆడే అవకాశం కల్పించింది కూడా పరాగే. కానీ, ఇప్పుడు వీరిద్దరి మధ్య విమానాశ్రయంలో జరిగిన ఈ సంఘటన అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. వైభవ్ చాలా స్పష్టంగా, మనసులో ఏదీ దాచుకోకుండా మాట్లాడే మనస్తత్వం కలవాడు కావడం వల్ల కూడా ఈ చిన్న వివాదం పెద్దదిగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అర్ష్‌దీప్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఊహించని పరిణామం!?

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత క్రికెట్ జట్టు యువ పేసర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు అర్ష్‌దీప్ సింగ్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జరిగిన ఒక ఊహించని పరిణామం ఇప్పుడు క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైదానంలోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఎంతో చురుగ్గా ఉంటూ అభిమానులను అలరించే ఈ స్పీడ్‌స్టర్, తాజాగా తన ఖాతా నుంచి ఏకంగా 200కు పైగా పోస్టులను తొలగించి అందరికీ పెద్ద షాక్ ఇచ్చాడు. క్రికెట్ ప్రపంచంలో అర్ష్‌దీప్ సింగ్ ఆటతీరుతో పాటు ఆయన చేసే వినోదాత్మక వీడియోలకు, రీల్స్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. తీరిక సమయం దొరికినప్పుడల్లా తోటి ఆటగాళ్లతో కలిసి సరదాగా వీడియోలు చేస్తూ అభిమానులతో పంచుకోవడం ఆయనకు అలవాటు. అయితే, తాజాగా ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ పేజీని పూర్తిగా ప్రక్షాళన చేశాడు. ప్రస్తుతం ఆయన ఖాతాలో కేవలం 44 పోస్టులు మాత్రమే మిగిలాయి. అందులోనూ ఎక్కువ భాగం వివిధ వ్యాపార ప్రకటనలకు సంబంధించినవే కావడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్ నెలలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో కలిసి అర్ష్‌దీప్ చేసిన ఒక ప్రత్యేక వీడియో సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించింది. దాదాపు 15 మిలియన్లకు పైగా వీక్షణలు (వ్యూస్) సాధించిన ఆ అరుదైన వీడియోను సైతం అర్ష్‌దీప్ ఇప్పుడు తొలగించాడు. దీంతో ఆరాధ్య ఆటగాడికి అసలు ఏమైంది? ఎందుకిలా పాత జ్ఞాపకాలన్నింటినీ చెరిపేస్తున్నాడంటూ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక బలమైన కారణాలే ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా అర్ష్‌దీప్ సోషల్ మీడియాలో ఏ పోస్ట్ పెట్టినా అది కాస్తా వివాదాలకు దారితీస్తోంది. కొద్దిరోజుల క్రితం ఆయన విమాన ప్రయాణంలో ఉన్నప్పుడు తీసిన ఒక వీడియో తీవ్ర దుమారం రేపింది. ఆ వీడియోలో తోటి ఆటగాడు యుజ్వేంద్ర చాహల్ ఈ-సిగరెట్ (వేపింగ్) కాలుస్తూ కెమెరాకు దొరికిపోయాడు. ఈ సంఘటన క్రీడా వర్గాల్లో తీవ్ర విమర్శలకు దారితీయడంతో బీసీసీఐ తీవ్రంగా స్పందించింది. లీగ్ మ్యాచ్‌లు ముగిసేవరకు సోషల్ మీడియాలో ఎలాంటి వీడియోలు చేయకూడదంటూ అర్ష్‌దీప్‌ను గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగానే, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు అర్ష్‌దీప్ పంచుకున్న మరో వీడియో వివాదాన్ని మరింత పెద్దది చేసింది. తోటి ఆటగాడు తిలక్ వర్మ చర్మ రంగును ఉద్దేశిస్తూ 'ఓయ్.. అంధేరా' (చీకటి) అంటూ అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి.

# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే ..సెకండ్ సింగిల్ విడుదల



నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగ మ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.

# సిఎం విజయ్‌తో లోకేశ్ కనగరాజ్ భేటీ



తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కజగం అధినేత, దళపతి విజయ్‌ను ప్రముఖ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ఆయన స్వయంగా కలిసి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌తో దిగిన ఫొటోను షేర్ చేసిన లోకేష్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ అన్నా నీకు శుభాకాంక్షలు అంటూ లోకేష్ రాసుకొచ్చాడు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మాస్టర్', 'లియో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌లుగా నిలిచిన సంగతి తెలిసిందే. కేవలం దర్శకుడిగానే కాకుండా విజయ్‌తో లోకేష్‌కు ఎంతో కాలంగా మంచి ఆత్మీయ అనుబంధం ఉంది.

# ముదిరిన డాన్-3 వివాదం

## రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం




'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్‌గా మారారు. 2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగినట్లు బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ.10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ.45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) రణ్‌వీర్‌పై మూడేళ్లు నిషేధం విధించింది. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకు ఆయనతో కలిసి పనిచేయవద్దని పరిశ్రమని ఆదేశిస్తూ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' ప్రకటన జారీ చేసింది. సినిమాలు కీలక దశలో ఉన్నప్పుడు సీనియర్‌లు, స్టార్‌లు ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలగడం వినోద పరిశ్రమ స్థిరత్వానికి.. పని వాతావరణానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ పేర్కొంది. అయితే, ఇది ప్రభుత్వం విధించిన నిషేధం కాకపోవడంతో రణ్‌వీర్‌పై పెద్దగా ప్రభావం పడదని సినీవర్గాలు భావిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై రణ్‌వీర్ టీమ్ స్పందించింది. 'ఆయన తన వృత్తిని ఎంతో గౌరవిస్తారు. 'డాన్ 3' విషయంలో జరుగుతోన్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు' అని టీమ్ పేర్కొంది. డాన్ 3లో భాగమైన ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో గౌరవిస్తారని తెలిపింది. ఈ బ్యాన్ ఆయన భవిష్యత్ ప్రాజెక్టులపై ఎంత ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది.

# బుచ్చిబాబు కోసం పెద్దిలో నటించా: దివ్యేందు






'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. తాను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..'స్టోరీ చూసి షాక్ అయ్యాను. ఎంత గొప్పగా రాశారో అనుకున్నా. ఎన్నో ట్విస్ట్‌లు, గొప్ప గొప్ప పాత్రలు ఉన్నాయి. గుర్తింపు కోసం ఎంత యుద్ధమైనా చేయొచ్చని ఈ సినిమా చూశాక అర్థం అవుతుంది.'పెద్ది'తనగుర్తింపు కోసం ఎంతో పోరాడతాడు.ఆ అంశం నాకు చాలా నచ్చిందని చెప్పారు.

# విశ్వంభర విడుదల తేదీపై అస్పష్టత






## మెగా ఫ్యాన్స్‌లో గందరగోళం

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మెగాస్టార్ అభిమానులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం మాత్రం 'విశ్వంభర' మూవీ గురించే. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే ప్రారంభమై, షూటింగ్ కూడా పూర్తయిన దశకు చేరుకున్నప్పటికీ.. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత రాకపోవడం అభిమానుల్లో అనుమానాలు పెంచుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న 'విశ్వంభర' మెగాస్టార్ కెరీర్‌లో అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండియర్ సెట్స్, భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, సినిమా రిలీజ్ విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ సినిమాను సమ్మర్ రిలీజ్‌గా తీసుకురానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్లాన్ అమలు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్లు కూడా లేకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశ్వంభర' ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని టాక్ వినిపిస్తోంది. ఫాంటసీ జానర్ కావడంతో సినిమాకు భారీ స్థాయిలో అవసరం పడుతోంది. ముఖ్యంగా ఫాంటసీ జానర్‌లో వస్తున్న 'విశ్వంభర' పై మొదటి నుంచే ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కానీ వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతుండటం, 'విశ్వంభర'పై మాత్రం నిశ్శబ్దం కొనసాగడం ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి పెంచుతోంది.

